



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్



నిరాశాజనకమే!

కేంద్ర బడ్జెట్ నిరాశను మిగిల్చింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2023-24 బడ్జెట్‌ను బుధవారం సుమారు రూ.48 లక్షల కోట్లతో ప్రవేశ పెట్టారు. రాష్ట్ర విభజన చట్టంలోని హామీలైన ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, గనుల కేటాయింపుల ఊసే కనిపించలేదు. రైల్వే బడ్జెట్‌లోనూ కడప-బెంగళూరు రైల్వేలైన్ సహా పెండింగ్ రైల్వే ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. చట్టబద్ధమైన హామీలను విస్మరించి కార్పొరేట్ల భజన చేసింది. ఎంఎస్ఎంఇలకు ప్రోత్సాహకాలు, అద్దె వ్యవసాయపనిముట్ల, ప్రకృతి వ్యవసాయాన్ని ఉటంకించింది. వేతనజీవుల ఆదాయపన్ను రూ.ఐదు లక్షల నుంచి రూ. ఏడు లక్షలకు మినహాయించడం మినహా కొత్తదనం కొరవడింది. 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేయడానికి సంబంధించి వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్ స్వామినాథన్ సిఫార్సులను విస్మరించి గతేడాది వ్యవసాయానికి కేటాయించిన రూ.1.32 కోట్ల నుంచి రూ.1.25 లక్షల అత్తెసరు కేటాయింపులతో సరిపెట్టింది.

వ్యవసాయానికి కేటాయింపుల్లో తగ్గుదల
ఉక్కు పరిశ్రమ ఊసే లేదు
వేతన జీవులకు ఊరట

ప్రజాశక్తి- కడప ప్రతినిధి/యంత్రాంగం

కేంద్ర బడ్జెట్‌లో పెండింగ్ ప్రాజెక్టుల ప్రస్తావనే కొరవడింది. జిల్లాకు సంబంధించిన పెండింగ్ ప్రాజెక్టుల కేటాయింపుల వివరాలు జాడే కనిపించలేదు. రాష్ట్ర విభజన చట్టంలోని హామీలైన ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, గనుల కేటాయింపు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి పెండింగ్ నిధులు, కడప-బెంగళూరు, కడప-విజయవాడ వంటి రైల్వే ప్రాజెక్టులకు కేటాయింపులు చేయాల్సి ఉంది. రూ.2.41 లక్షల కోట్లతో రైల్వేబడ్జెట్ ప్రస్తావన చేసింది. ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు తెలియడం లేదు. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలనే ప్రధానమంత్రి తన హామీనే విస్మరించి, వ్యవసాయ అనుబంధ రంగాలైన గ్రామీణాభివృద్ధికి నిధులు భారీగా కుదించింది. వ్యవసాయాభివృద్ధికి అరకొరగానే నిధులు కేటాయించింది. ఉమ్మడి జిల్లాలోని సుమారు ఐదు లక్షల మంది రైతుల్లో ఎందరికి ప్రయోజనం చేకూరనుందో తెలియని అనిశ్చితి నెలకొంది. ఉద్యోగుల ఆదాయ పన్ను శ్లాబులను సవరించడం ఊరటను కలిగించింది. ఫలితంగా ఉమ్మడి జిల్లాలోని 32 వేల మంది ఉద్యోగులు, 22,800 మంది పెన్షనర్లకు రిక్తహస్తాన్ని చూపించింది. రాష్ట్ర విభజన జరిగిన తొమ్మిదేళ్లు గడిచిన నేపథ్యంలో వెనుక బడిన ప్రాంతాల అభివృద్ధి నిధుల విడుదల జాడే కనిపించలేదు. జిల్లాలోని పెండింగ్ రైల్వే ప్రాజెక్టులైన కడప- బెంగళూరు, కడప-విజయవాడ, ఓబులవారిపల్లి - కృష్ణపట్నం సివిల్ రైల్వే ప్రాజెక్టులకు కేటాయింపులపై అందరిదృష్టి నిలిచింది. ఉపాధి హామీ పనుల కేటాయింపులు సమాచారం తెలియాల్సి ఉంది. దేశ వ్యాప్తంగా 81 లక్షల స్వయంసహాయక సంఘాలను ఏర్పాటు చేస్తామని హామీనిచ్చింది.

జిల్లాకు రిక్తహస్తమే

కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు రిక్తహస్తమే. రాష్ట్ర విభజన చట్టంలోని వెను కబడిన ప్రాంతాలైన రాయలసీమ, ఉత్తరాంధ్రలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ, విశాఖ రైల్వేజోన్, కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు వంటి ప్రధాన హామీలకు ఏళ్ల తరబడి అన్యామే చేస్తోంది. కడప-బెంగళూరు, కడప-విజయవాడ, కృష్ణపట్నం-ఓబులవారిపల్లి ప్యాసింజన్ రైల్వేలైన్, కడప నుంచి రాజధానికి రైలు ప్రస్తావన లేదు. కడప విమానాశ్రయం రన్‌వే పొడిగింపు పనుల కేటాయింపుల ప్రస్తావనే లేదు. వ్యవసాయ రంగ కేటాయింపులను పరిశీలిస్తే రైతుల ఆదాయం రెట్టింపు హామీని తుంగలో తొక్కేసినట్లు అవుతోంది. ప్రధాన మంత్రి హామీకే దిక్కు లేకుండా పోవ డం విస్మయాన్ని కలిగిస్తోంది.

- జి.చంద్రశేఖర్, సిపిఎం జిల్లా కార్యదర్శి, కడప.

మొండిచేయి

జిల్లాకు మొండిచేయి చూపిం చింది. తొమ్మిది రాష్ట్రాల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్ రూపల్పన చేయ డం కనిపించింది. కార్పొరేట్లను ఊడిగం చేయడం దారుణం. రైతాంగానికి కేటాయింపులు తగ్గించడం దారుణం. దేశాన్ని అమ్మకానికి పెట్టినట్లు ఉంది. ఎపికి సంబందించి ఎటువంటి హామీ నెరవేర్చిన పాపానలేదు. ద్రవ్యోల్బణాన్ని పెంచి సామాన్యుల జీవితాలను కడగండ్ల పాలు చేసింది. కడప-బెంగళూరు, విజయవాడ రైల్వేప్రాజెక్టు ఊసేలేదు.

- జి.ఈశ్వరయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి, కడప.



కడప : బడ్జెట్ ప్రతులను దగ్ధం చేస్తున్న డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు

బడ్జెట్ ప్రతులు దగ్ధం

కడప అర్బన్ : కేంద్ర బడ్జెట్‌లో కడప ఉక్కును విస్మరించడాన్ని నిరసిస్తూ కడప పూలే సర్కిల్‌లో బడ్జెట్ ప్రతులను డివైఎఫ్ఐ ,ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా నాయకులు వీరనాల శివకుమార్, రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం విభజన హామీలను విస్మ రించిందని అందులో ప్రధానంగా కడప ఉక్కు పరిశ్రమను నిర్లక్ష్యం చేస్తోందని చెప్పారు. గడిచిన ప్రతి పార్లమెంటు, బడ్జెట్ సమావేశాలలో కడప ఉక్కు కు నిధులు కేటాయిస్తారని జిల్లా ప్రజలు, విద్యార్థులు, నిరుద్యోగ యువకులకు ఆశగా ఎదురు చూసారని వారికి ప్రతి సారి నిరాశే ఎదురు అవుతుందని అన్నారు. కడప ఉక్కుపై కేంద్రంతో పోరాడాలని అన్నారు.

రైతు వ్యతిరేక బడ్జెట్

రైతు వ్యతిరేక బడ్జెట్. రూ.48 లక్షల కోట్ల బడ్జెట్ వ్యవసాయానికి గాలికి వొదిలేసింది. దేశంలో 70 శాతం రైతులు ఉండగా, రూ.1.25 లక్షల కోట్లతో సరిపెట్టడం విస్మయాన్ని కలిగించింది. ఈలెక్కన 2.57 శాతం కేటా యింపులు చేయడం దారుణం. 1940 నుంచి 2014 వరకు 13 మంది ప్రధాన మంత్రుల హాయంలో రూ.40 లక్షల కోట్లు అప్పు ఉంటే, మోడీ హయా ంలో నుంచి రూ.1.09 లక్షల కోట్లు అప్పు చేయడం విస్మయకరం. ఈఏడాదికి మరో రూ.15.30 లక్షల కోట్లు అప్పు చేస్తామనడం పేర్కొనడం దారుణం. మొత్తం బడ్జెట్‌ను పరిశీలిస్తే 34 శాతం అప్పులే కనిపించాయి.

- ఎన్.తులసిరెడ్డి, పిసిసి మీడియా చైర్మన్.

రాష్ట్రానికి అన్యాయమే

కేంద్రబడ్జెట్‌లో రాష్ట్రానికి, జిల్లాకు తీరని అన్యాయం. ప్రత్యేక హోదా ఇస్తామని నమ్మించి మోసం చేయడం దారుణం. వెనుకబడిన ప్రాంతాలకు నిధులు కేటాయింపులు, పోలవరం ప్రస్తావనే లేదు. కడప స్టీల్‌ప్లాంట్, కడప-బెంగళూరు రైల్వేలైన్ ఊసే లేకపోవడం దారుణం.

- ఆర్.శ్రీనివాసులరెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షులు.

కార్మిక, ప్రజావ్యతిరేక బడ్జెట్

కేంద్ర బడ్జెట్ కార్మికులకు, రైతులకు, శ్రమ జీవులకు, ప్రజలకు పూర్తిగా వ్యతిరేకంగా ఉంది. దీనిని ప్రజలు అందరూ తిరస్కరించాలి. ఐసిడిఎస్, మధ్యాహ్న భోజనం, జాతీయ ఆరోగ్యమిషన్, జాతీయ విద్యామిషన్, జాతీయ జీవనోపాధులు మిషన్‌లకు కేటాయింపులు పెంచలేదు. ఉపాధి హామీ పథకానికి కేటాయింపులు, పనిదినాలు 200కు పెంచాలి. రోజు వేతనం రూ.600 చేయాలి. అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి పెద్ద ఎత్తున నిధులను కేటాయించి సంక్షేమ పథకాలను వర్తింపజేయాలి.

- పి.శ్రీనివాసులు, సిపిఎం అన్నమయ్య జిల్లా కార్యదర్శి.

విద్యారంగానికి నిధులు శూన్యం

కేంద్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి అధిక నిధులు మంజూరు చేస్తారని అనుకుంటే అంకెలకే పరిమితమైంది. బిజెపి ప్రభుత్వం విద్యా రంగం పట్ల నిర్లక్ష్యం వహిస్తోంది. విద్యా ప్రమాణాలు తగ్గిస్తూ ప్రయివేట్, కార్పొరేట్ విద్యకు ప్రోత్సహిస్తోంది. విదేశీ యూనివర్సిటీలకి రెడ్ కార్పొరేట్ వేసి స్వాగతం పలుకుతోంది. విదేశీ యూనివర్సిటీల అనుమతులు రద్దు చేయాలి. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కోసం రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలి.

- నరసింహ, ఎస్ఎఫ్ఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి.

మధ్యతరగతి ఉద్యోగులకు నిరాశే

భారతదేశంలో ఆదాయం పన్ను లెక్క కట్టేందుకు రెండు పద్ధతులున్నాయి. ఒక ఉద్యోగికి తాజా బడ్జెట్ ప్రతిపాదనల వల్ల సంవత్సరానికి తగ్గే పన్ను భారం రూ.2,500 మాత్రమే. కొత్త రెజీమ్ ఎంచుకున్న ఉద్యోగులకు కొంత లాభం ఉంది. కొత్త రెజీమ్‌లో పొదుపుకు ప్రోత్సాహకాలు ఉండవు. కేంద్ర ప్రభుత్వం తాను అనుకున్న స్టాక్ మార్కెట్ అనుకూల అజెండాను అమలు చేసింది తప్ప ఉద్యోగుల ఆకాంక్ష మేరకు ఆదాయపు పన్ను భారాన్ని తగ్గించలేదు.

- ఎ.రఘునాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి, ఎల్ఐసి ఉద్యోగుల సంఘం, కడప.

ఆకలి సూచికలో వెనుకబాటు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలకు పూర్తిగా వ్యతిరేకంగా ఉంది. కేవలం ప్రైవేటు పెట్టుబడులకు అనుకూలంగా ఉన్న బడ్జెట్‌ను తిరస్కరించాలి. ఆకలి సూచికలో వెనుకబడటం, పోషకాహార లోపం తదితరాలతో బాధపడుతున్న ప్రజానీకానికి బడ్జెట్ ఎటువంటి రక్షణ కల్పించలేదు

- ఎ.రామమోహన్, సిపిఎం నగర కార్యదర్శి, కడప.

వేతన జీవులకు ఊరట

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో ఆదాయ పన్నుల విషయంలో వేతన జీవులకు ఊరట కల్పించినప్పటికి వారికి ఆదాయ సంపార్జన మార్గాల వైపు బడ్జెట్ కేటాయించి ఉంటే ఇంకా బాగుండేది. యువత కోసం పీఎం కౌశల్ పథకంలో భాగంగా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ల కోసం బడ్జెట్ కేటాయించడం మంచి నిర్ణయం.

- డాక్టర్ రమేష్, ఆర్థిక విశ్లేషకులు, కడప.

కొఠారి కమిటీకి ఆమడదూరం

కొఠారి కమిషన్ విద్యారంగానికి జిడిపిలో 6 శాతం నిధులు కేటాయించాలని చెప్పినా ప్రస్తుత బడ్జెట్లో జిడిపిలో 0.3 శాతం మొత్తం బడ్జెట్లో 2.5 శాతం మాత్రమే కేటాయించడం దారుణం. విద్యా రంగానికి అరకొర నిధులు కేటాయింపు చేయడం ద్వారా విద్యారంగ బాధ్యతల నుండి ప్రభుత్వం తప్పుకుంటున్నట్లు అర్థమవుతోంది. శాస్త్ర, సాంకేతిక రంగాలకు బడ్జెట్‌లో 2 శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా 0.7 శాతం మాత్రమే కేటాయించింది. శాస్త్రీయ ఆలోచన కలిగిన విద్యార్థుల్ని తయారు చేయడానికి అవరోధం ఏర్పడుతుంది.

- లక్ష్మిరాజ, విజయ్‌కుమార్, మహేష్‌బాబు, యుటిఎఫ్ నాయకులు.

'అదాని' అక్రమాలపై ఉన్నత స్థాయి విచారణ

దేశ ప్రజల ఆస్తులు కార్పొరేట్ కంపెనీలు స్వాహా
సిపిఎం జిల్లా విస్తృత సమావేశంలో కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్ పిలుపు

ప్రజాశక్తి - కడప అర్బన్

దేశ ప్రజల ఆస్తులను కార్పొరేట్ కంపెనీలకు తాకట్టు పెట్టే విధంగా మోడీ ప్రభుత్వం కంక ణం కట్టుకుందని, అదాని గ్రూప్ అక్రమాలపై ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ తెలిపారు. బుధవారం సిపి ఎం జిల్లా కార్యాలయంలో విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ నిరుద్యోగం, పేదరికం, ఆర్థిక అసమానతలు విపరీ తంగా పెరిగి పోతుండడంతో ప్రజల జీవనోపాధిపై నిరంతరం దాడులు కొనసాగుతున్నాయని తెలిపారు. వీటికి వ్యతిరేకంగా ఈనెల 22 నుంచి 28 వరకు దేశవ్యాప్త నిరసన కార్యక్రమాలను నిర్వహి స్తున్నట్లు పేర్కొన్నారు. 40 శాతానికి పైగా ప్రజల సంపదంతా కేవలం ఒక్క శాతం మంది దగ్గర పోగు పడిందని చెప్పారు. శతకోటీశ్వరుల సంఖ్య 102 నుంచి 166కు చేరిందని తెలిపారు. ఉపాధి అవకా శాలు సృష్టించే మౌలిక వసతులపై ప్రభుత్వ పెట్టుబడులు పెరగాలని కోరారు. ఆదానీ సామ్రాజ్యం కుప్ప కూలిపోతుందని, రూ.10 లక్షల కోట్లు ఆవిరి అయిపో యిందని పేర్కొన్నారు. రూ.18 వేల కోట్ల ఎల్ఐసి షేర్లు దివాలా తీయించారని, ప్రజల సొమ్మును, ఆదానికి దోచి పెట్టారని తెలిపారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు పెంచి ప్రజల పైన భారం మోపారని విమర్శించారు. అవుట్ సోర్స్, కాంట్రాక్టు ఉద్యోగులకు, స్కీం వర్కర్లకు వేతనాల పెంచలేదన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోరాటం ద్వారా సాధిం చుకున్న 44 కార్మిక చట్టాలను, నాలుగు కోడులుగా, పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చారన్నారు. ఎనిమిది గంటల పనిని 12 గంటలకు చేశారని, సమ్మె చేసే హక్కును, సంఘం పెట్టుకునే హక్కును లేకుం డా చేస్తున్నారని వాపోయారు. రైతులకు గిట్టుబాటు ధర లేకుండా, పనిముట్లు ఎరువులు ధరలు పెంచా రన్నారు. భిన్నత్వంలో ఏకత్వం ఉన్న దేశాన్ని కేంద్రంలో మతోన్మాద బిజెపి పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ లాంటి మత రాజ్యాలుగా మార్చాలని ప్రయత్నిస్తుందని తెలిపారు. మత రాజ్యాల్లో అభివృద్ధి కాలేదని చెప్పారు. ఏ మతం జోక్యం లేకుండా లౌకిక దేశంగా ఉండాలని కోరారు. వామ పక్షాలు తెచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని, నిర్వర్యం చేస్తున్నారని ఆందో ళన వ్యక్తం చేశారు. బడ్జెట్లో నిధులు కోత విధిస్తు న్నారని, ఉపాధి కూలి రూ.600 పెంచాలని, 200 రోజులు పని దినాలు కల్పించాలని, పట్టణాలకు విస్తరించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్థల ప్రయివేట్‌పరం చేయటం, రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలు పెంచి స్మార్ట్ మీటర్లు పెట్టడం, రైతులు, ప్రజల పైన భారాల మోపడం కోసం అన్నారు. కార్మిక రైతు, కూలి వ్యతిరేక విధానాలకు, నిరసనగా ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాల అమలు చేస్తున్నారని విమర్శించారు. పెట్టుబడిదారులకు, కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్నారని తెలిపారు. మతోన్మాద బిజెపి నుంచి దేశాన్ని రక్షించ డానికి సైనికుల్లా పోరాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రామమోహన్, మనోహర్, శివకుమార్, బి.నారాయణ, ఐ.ఎన్. సుబ్బమ్మ, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసులురెడ్డి, సత్యనారాయణచారి, దస్తగిరిరెడ్డి, పాపిరెడ్డి, అన్వేష్, లక్ష్మీదేవి, జిల్లా నాయకులు భైరవ ప్రసాద్, చంద్రారెడ్డి, శివకుమార్, ఓబులేష్, సునీల్ కుమార్, గోపాల కృష్ణయ్య, వెంకటేష్, సుబ్బరాయుడు, మహబూబ్ తార, వివిధ మండలాల నుంచి శాఖ కార్యదర్శిలు, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

సంకల్ప దీక్ష పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-రాయచోటి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

భద్రతలేని సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి, ఒపిఎస్‌ను అమలు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేస్తూ ఈ నెల 3వ తేదీన ధర్మస్థలిలో నిర్వహించే సంకల్ప దీక్షను జయప్రదం చేయాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాబిర్ పిలుపు నిచ్చారు. బుధవారం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో సంకల్ప దీక్ష పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంకల్ప దీక్షలో ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొని పాత పెన్షన్ విధానం అమలు చేసే వరకు పోరాటంలో ఉండాలని కోరారు. సిపిఎస్, జిపిఎస్ ఏదైనా ఉద్యోగ దోపిడీ అని ఒపిఎస్ అమలే సామాజిక బాధ్యతని చెప్పారు. సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేస్తామని ఎటువంటి హామి ఇవ్వనీ రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తున్నాయని పేర్కొన్నారు. హిమాచల్‌ప్రదేశ్, తమిళనాడు, కేరళ, ఢిల్లీ ప్రభుత్వాలు ఒపిఎస్ అమలు కోసం ప్రయత్నాలు చేస్తున్నాయని తెలిపారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి ముఖ్యమంత్రి జగన్ మాట తప్పి సిపిఎస్ కంటే కూడా ఘోరమైన జిపిఎస్‌ను అమలుకు పూనుకోవడం అన్యాయమన్నారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గోపాల్ నాయక్ మాట్లాడుతూ పోరాటాల ద్వారానే ఏదైనా సాధించకోగల మన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనరు సురేంద్రరెడ్డి రాయచోటి మండల ప్రధాన కార్యదర్శి రాజా రమేష్,చిన్న మండెం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ప్రసాద్, కిఫాయత్, గాలివీడు మండల ప్రధాన కార్యదర్శి అమీనుల్లా పాల్గొన్నారు.



చంద్రబాబును సన్మానిస్తున్న రమేష్‌రెడ్డి

చంద్రబాబును కలిసిన రమేష్‌రెడ్డి

రాయచోటి: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును బుధవారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్ కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పూలబొకే, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రమేష్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబుకు రాయచోటి నియోజకవర్గ పరిస్థితులపై వివరించానని తెలిపారు. నియోజకవర్గంలో చేపడుతున్న మన రాష్ట్రానికి ఇదేంఖర్మ కార్యక్రమం విజయవంతంపై చెప్పానన్నారు. చంద్రబాబు నాయుడు రమేష్ కుమార్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ భాషా పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్‌కు భూమిపూజ

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణంలోని మదనపల్లె రహదారి మార్గంలో న్యూ ఎల్ఐసి కాలనీలో ఆదిరెడ్డి, జస్వంత్‌కుమార్ రెడ్డి, వివేకానందరెడ్డి నూతనంగా ఏర్పాటు చేయబోయే ఆదిత్యా ఇన్ఫ్రాస్ట్రక్షర్ అపార్ట్ మెంట్ భూమిపూజను మంగళవారం ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేగడికోట మోహన్‌రెడ్డి నిర్వహించారు.జిల్లా కేంద్రంలో అపార్ట్‌మెంట్‌లు నిర్మించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, ప్రముఖ వైద్యులు డాక్టర్ బయారెడ్డి, మదనపల్లె నియోజకవర్గ పరిశీలకులు హబీబుల్లాఖాన్, కోడి శ్రీనివాసులు, నాగేంద్రారెడ్డి పాల్గొన్నారు.



అపార్ట్‌మెంట్‌కు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



సిబ్బందికి బహుమతులు ఇస్తున్న ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు

క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు అన్నారు. సాయుధ పోలీస్ బలగాలకు రెండు వారాలపాటు నిర్వహించిన మొబలైజేషన్ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఆర్ పోలీస్ సిబ్బందికి ప్రతి సంవత్సరం మొబలైజేషన్ నిర్వహించి విధుల్లో నైపుణ్యం శారీరక దృక్పథం మెరుగుపరచడం ఆనవాయితీగా వస్తుందని పేర్కొన్నారు. ఉద్యోగాల్లో చేరే ముందు శిక్షణలో నేర్చుకున్న అంశాలను మరోసారి గుర్తు చేసుకుంటూ మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దుకునేందుకు దోహదం చేస్తాయన్నారు. పోలీసులు ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమర్థవంతంగా విధులు నిర్వహించడానికి వీలవుతుందని తెలిపారు. యోగా ధ్యానం, ఆర్థిక క్రమశిక్షణపై ప్రత్యేక తరగతులు నిర్వహించామని చెప్పారు. సిబ్బంది విధుల్లో నైపుణ్యాన్ని మెరుగుపరచుకోవాలని ఫైరింగ్, డ్రిల్, కవాతు, మాబ్ కంట్రోల్, ప్రముఖుల బందోబస్తు తదితర విధులు సమర్థవంతంగా ఎలా నిర్వహించాలో దిశా నిర్దేశం చేశారు. సిబ్బంది సంక్షేమంలో భాగంగా పలు చర్యలు తీసుకుంటున్నామని మొబలైజేషన్‌లో కీలకంగా విధులు నిర్వర్తించిన అధికారులు సిబ్బందికి ప్రశంస పత్రాలతో పాటు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్పీ డాక్టర్ విబి రాజ్ కమల్, ఎఆర్ డిఎస్‌పి మెహబూబ్ భాష, ఆర్ఐలు మహబూబ్ అలీ, జావేద్ పెద్దయ్య, ఆర్ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు విజయవంతం

ప్రజాశక్తి-రాయచోటి

రాయచోటిలోని ఐకె పాఠశాలలో యూత్ ఐకాన్ వినయ్ కుమార్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి కబడ్డీ ఛాంపియన్ షిప్ పోటీలు విజయవంతంగా ముగిశాయి. బుధవారం ముగింపు వేడుకలలో ముఖ్య అతిథులుగా రాయచోటి డిఎస్‌పి శ్రీధర్, మనోజ్ కుమార్ రెడ్డి, శివ గంగిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తి చూపుతూ యూత్ ఐకాన్ వినయ్ కుమార్ జిల్లా స్థాయి కబడ్డీ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులను ప్రోచాహించేలా కార్యక్రమం ఏర్పాటు చేయడం మంచిదన్నారు. ఇలాంటి కార్యక్రమాలను ప్రోత్సహిస్తూ సహకరిస్తున్న ఐకె పాఠశాల వారిని ఆయన అభినందించారు. మనోజ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించే నిర్వహించడం హర్షనీయమన్నారు. శివగంగిరెడ్డి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థులు ఆరోగ్యవంతంగా తయారవుతారని చెప్పారు. ఐకె పాఠశాల కరస్పాండెంట్ ఇసక్‌అలీఖాన్, ఆర్గనైజర్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ ఛాంపియన్‌షిప్ విజయవంతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదములు తెలిపారు. పోటీలల్లో విజేతలుగా బాలుర జట్టు దేవపట్ల హైస్కూల్, బాలికలు జట్టు కలిచేర్ల హై స్కూల్, రెండో స్థానం సాధించిన వారు బాలికలు నులివీడు హైస్కూల్, బాలుర గాలివీడు హైస్కూల్ జట్టు క్రీడాకారులకు అభినందనలు తెలుపుతూ బహుమతులు, ధృవపత్రాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస రాజు, అమర్నాథ్ రెడ్డి, వీరాంజనేయులు, లాలితమ్మ, సులోచన, పుష్ప, కరుణాకర్, అలీ, అన్నమయ్య జిల్లా పీడీలు, ఉపాధ్యాయులు విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



కబడ్డీ బాలికల విజేత జట్టుకు కప్‌ను అందజేస్తున్న నిర్వాహకులు



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్

చలో ఢిల్లీని జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 5వ తేదీన చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ పేర్కొన్నారు. బుధవారం పురపాలక కార్యాలయంలో మున్సిపల్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగులకు, స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ సంస్థలను ప్రయివేటు పరం చేస్తోందన్నారు. నిర్బంధాల ద్వారా ఉద్యమాల అణచివేతకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. మతోన్మాద బిజెపి నుండి దేశాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. చలో ఢిల్లీ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు ఓబయ్య, లక్ష్మీదేవి, ప్రసాద్, రమణ పాల్గొన్నారు.

బాలుడి ఆరోగ్యానికి చేయూత

రాయచోటి టౌన్ : బాలుడి ఆరోగ్యం కోసం ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆర్థిక చేయూతనందించారు. పట్టణంలోని బోస్ నగర్‌కు చెందిన ఖాదర్‌వలీ కుమారుడు నాలుగేళ్ల షేక్ మహమ్మద్ మూసా గుండె జబ్బుతో బాధపడుతున్నాడు. వైద్యానికి అధిక ఖర్చు అవుతుందని వైద్యులు తెలపడంతో పేదకుటుంబానికి చెందిన ఖాదర్ వలీ స్థానిక వైసిపి నాయకులు ఫయాజ్ అహమ్మద్ ద్వారా ఎంఎల్ఎకు తన బిడ్డ ఆరోగ్య పరిస్థితిని వివరించారు. తక్షణం స్పందించిన ఎంఎల్ఎ ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులతో మాట్లాడి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.2.40 లక్షలు నిధులు విడుదల చేస్తూ తిరుపతిలోని పద్మావతి చిల్డ్రన్స్ హార్ట్ సెంటర్‌కు ఎల్‌ఒసి పత్రాన్ని మంజూరు చేయించారు. ఆ ఎల్‌ఒసి పత్రాన్ని లబ్ధిదారు కుటుంబానికి శ్రీకాంత్‌రెడ్డి అందజేశారు. తమ కుమారుడి ఆరోగ్యం మెరుగునకు నిధులు మంజూరు చేసిన సిఎం జగన్‌కు, సహకరించిన ఎమ్మెల్యేకు బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, మదనపల్లె నియోజక వర్గపరిశీలకులు హాబీబుల్లాఖాన్, రియాజ్, సైఫుల్లా పాల్గొన్నారు.



ఆధార్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

ఆధార్ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- కలకడ

మండలంలోని బాలయ్య గారి పల్లి పంచాయతీ ఎర్రయ్యగారిపల్లి సచివాలయంలో ఆధార్ కేంద్రాన్ని జిఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా ఇన్‌ఛార్జ్ మనోహరరాజు, తహశీల్దార్ రాము, ఎంపిడిఒ సిహెచ్. నారాయణలు కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ప్రజలు తమకున్న ఆధార్ కార్డులో చిరునామాలు, ఫోటోలు తదితర అంశాలను మార్చుకునేందుకు ఆధార్ కార్డు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సింగల్‌విండోచైర్మన్ కమలాకర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నందిని, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి-కలకడ

కుష్టువ్యాధి అరికట్టడం మనందరి బాధ్యతని వైద్యాధికారి ఎంవి.కిషోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రపరిధిలోని పాపిరెడ్డిగారిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కుష్టువ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యా ధికారి మాట్లాడుతూ చర్మముపై స్పర్శలేని రాగిరంగు కలిగిన మచ్చలను కుష్ఠ వ్యాధిగా గుర్తించవచ్చని అన్నారు. చర్మంపై బోడిపెలు, పొడిబారిన చర్మము కలిగి గట్టిగా ఉంటుందని తెలిపారు. అరికాళ్ళలో పుండ్లు, కండరాళ్ల బలహీనత, కను బొమ్మలు పాక్షికంగా దెబ్బతినడం, పక్షవాతం కూడా వస్తోందన్నారు. కార్య క్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎ.శ్రీనివాసులురెడ్డి, ఎంపిహెచ్ఇఒ జయరామ య్య, పిహెచ్ఎన్ సుబ్బరత్న, ఎఎన్ఎం వాణి, ఆశ వర్కర్ రమణమ్మ, రేష్మ, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** కుష్టువ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని కోనంపేట వైద్యులు సిద్దయ్య పేర్కొన్నారు. స్థానిక ఎపి మోడల్ స్కూల్, కస్తూర్బా గురుకుల పాఠశాలలో విద్యార్థులకు కుష్టి వ్యాధి,పోలియో, మశూచి గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ రవీంద్ర ,సూపర్వైజర్లు మనీ, ఎఎన్ఎంలు,హెల్త్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

మానవతా సాయం హర్షణీయం

ప్రజాశక్తి-ఓబులవారిపల్లి

మండలం పరిధిలోని చెన్నరాజుపూడి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో పనిచేస్తున్న ఎల్ఎం పవన్‌కుమార్ ఇటీవల ప్రమాదవశాత్తు విద్యుత్ లైన్ తాకి మృతి చెందాడు. ఆయన కుటుంబానికి వైసిపి నాయకులు, ఎపి టూరిజం డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి, రాష్ట్ర ప్రచారకార్యదర్శి సిడి.నాగేంద్ర మానవత్వంతో వారి కుటుంబానికి రూ.50వేలు ఆర్థిక సాయం చేశారు. విద్యుత్‌శాఖ అధికారులు ఎడి బాలాజీ, ఎఇ విజయ్‌కుమార్ రెడ్డిలు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో లైన్ ఇన్స్పెక్టర్ బి.గంగయ్య , లైన్మెన్లు, విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి-ములకలచెరువు

ములకలచెరువు మండలంలోని శ్రీశారద విద్యామందిర్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సి.చర్విత్ జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. జనవరి 28,29 తేదీలలో కాకినాడ పిఆర్ కళాశాల ప్రాంగణంలో జరిగిన అండర్-14 రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలలో తన ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి బేస్ బాల్ పోటీలకు ఎంపిక అయ్యాడు. ఈ సంద ర్భంగా విద్యార్థి సి.చర్విత్‌ను ఎంఇఒ యన్.వెంకటరమణ, కరస్పాండెంట్ శ్రీవాణిసనత్, తల్లిదండ్రులు ఉపాధ్యాయబృందం అభినందించారు.

సర్పంచుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-కలకడ

సర్పంచుల సమస్యలు పరిష్కరించి ఆదుకోవాలని తాడేపల్లిలో జరిగిన రాష్ట్ర సర్పంచుల సమావేశంలో మంత్రి, ప్రభుత్వ సలహదారులను కోరినట్లు జిల్లా సర్పంచ్ సంఘం అధ్యక్షులు చిదంబరెడ్డి పేర్కొన్నారు. బుధ వారం తాడేపల్లిలో జరిగిన రాష్ట్ర సర్పంచుల సమావేశానికి హజరైనట్లు తెలి పారు. సర్పంచుల సమస్యలను ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు, పార్టీ వ్యవహారాలు ఇన్‌ఛార్జ్, ఎమ్మెల్సీ లేళ్లఅప్పిరెడ్డిల దృష్టికి తీసుకపోయినట్లు తెలిపారు. గ్రామా లలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను సర్పంచులకు స్వాదీనం చేయా లని అన్నారు. స్పందన కార్యక్రమం దుర్వినియోగం కాకుండా తప్పుడు ఫిర్యా దులు ఇచ్చినవారిని శిక్షించాలని కోరారు.

ప్రవేశ పరీక్షకు 8 వరకు గడువు పొడిగింపు

గాలివీడు : జవహర్ నవోదయలో ఆరో తరగతి ప్రవేశ పరీక్ష కొరకు ప్రభుత్వం జనవరి 31 వరకు గడువు ఇచ్చిందని, ఆ గడును తిరిగి ఫిబ్రవరి 8వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.రెడ్డెన్న పేర్కొ న్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు.

రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల పరిధిలోని రైతులకు సీనియారిటీ ప్రకారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పంపిణీ చేసినట్లు విద్యుత్ శాఖ ఎఇ వసంతరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రస్తుతం ఎలాంటి విద్యుత్ కోతలు అమలులో లేవన్నారు. రైతులకు 9గంటల నాణ్యమైన ఉచితవిద్యుత్‌ను వ్యవసాయానికి అందిస్తున్నట్లు తెలిపారు. గత కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సర్వీసులన్నీ నాలుగు నెలల వ్యవధిలో యుద్ధ ప్రాతి పదికన అందించినట్లు తెలిపారు. ఇప్పటివరకు 736 ట్రాన్స్‌ఫార్మర్లు పంపిణీ చేయాల్సి ఉండగా 716 ట్రాన్స్‌ఫార్మర్లను పంపిణీ చేశామన్నారు. కొన్నిచోట్ల రైతుల పొలాల వద్ద సరైన దారి లేకపోవడంతో ఆలస్యం అవుతుందన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతిరైతుకు పంపిణీ చేసినట్లు పేర్కొ న్నారు. రైతులు దరఖాస్తు చేసుకున్న చోటునే ఎలాంటి సిఫారసు లేఖలు లేకుం డానే విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సర్వీసులపై ఏదైనా సందే హాలు ఉంటే నేరుగా విద్యుత్ శాఖాధికారి దృష్టికి తీసుకురావాలని సూచించారు.

సినిమా థియేటర్లలో పరిశుభ్రత పాటించాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

సినిమా థియేటర్లలో యాజ మాన్యాలు ప్రభుత్వ నిబంధనల మేరకు పరి శుభ్రత పాటించాలని డిఎం అండ్‌హెచ్ఒ కార్యాలయ ఎంపి హెచ్ఒ సరళ సూచిం చారు. బుధవారం తంబ ళ్లపల్లెలోని విజయథియేటరును తనిఖీ చేశారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు, తదితరాలను పరిశీలించారు. సినిమా చూసేందుకు వచ్చే ప్రేక్షకుల సౌకర్యార్థం పరిశుభ్రత తప్పనిసరి అన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈమె వెంట ఎంపిహెచ్ఎస్ బాలపెంచలయ్య, కోసవారిపల్లి పిహెచ్‌సి, డిహెచ్ఒ సుమతి, ఎంపిహెచ్ఒ రమణలు ఉన్నారు.



మరుగుదొడ్లను పరిశీలిస్తున్న ఎంపిహెచ్ఒ సరళ

గ్రామ స్వరాజ్య స్థాపనకు సిఎం కృషి : 'గడికోట'

ప్రజాశక్తి-గాలివీడు

గాంధీజీ కలలుకన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు సిఎం జగన్ కృషిచేస్తున్నారని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పెర్కొన్నారు. బుధవారం కోర్లకుంట గ్రామ సచివాలయ నూతన భవన నిర్మాణ ప్రారంబోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ సచివాల యాలు రాష్ట్రాభివృద్ధికి ప్రామాణికాలుగా నిలిచాయని అన్నారు. ప్రతిగ్రామ పంచాయతీ పరిధిలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్ లను ప్రభుత్వం నిర్మిస్తోందన్నారు. ముఖ్యమంత్రి పాలన దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. సచివాలయ పరిధిలోని గ్రామ సచివాలయం, వైఎస్ఆర్ రైతుభరోసా కేంద్రం, విలేజ్‌హెల్త్‌క్లినిక్ భవనాలను నిర్మించడం అభినందనీయమన్నారు. కార్య క్రమమంలో మైనార్టీ నాయుడు, ఖాదర్ మేదీన్ సర్పంచులు, ఎంపిడిఒ శేఖర్ నాయక్, డాక్టర్ స్రవంతిరెడ్డి, తహశీల్దార్ దైవాదీనం పాల్గొన్నారు.



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

యథాతథంగా బస్సు సర్వీసు వేళలు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-గాలివీడు

రాయచోటి నుంచి గాలివీడుకు రాత్రివేళ నడిపే బస్సు సర్వీసు ను యథాతథంగానే నిర్వహిస్తున్నట్లు ఆర్‌టిసి డిఎం పేర్కొన్నారు. ప్రజాశక్తి దినపత్రిలో ' బస్సు సర్వీసు వేళను మార్చొద్దు' అనే శీర్షికతో వార్త ప్రచురి తమైంది. ఈ వార్తకు ఆర్‌టిసి డిఎం, ట్రాఫిక్ డిపో సిఐ స్పందిం చారు. ఆర్‌టిసి సర్వీసు బస్సు రాయచోటిలో రాత్రి 9:30 గంటలకు బయలుదేరి గాలివీడికి వచ్చి,తిరిగి ఉదయం 4:30 గంటలకు రాయచోటికి వెళ్ళేది. అయితే ఆర్‌టిసి అధికారులు 9గంటలకు వెళ్లే విధంగా సమ యాన్ని మార్పు చేశారు. ప్రయాణీకుల ఇబ్బందులపై ప్రజాశక్తి దినపత్రికలో వార్త ప్రచు రితం కావడంతో అధికారులు స్పందించి తిరిగి పాత సర్వీసునే పునరు ద్ధరించారు. ప్రయాణికులకు తృప్తినిచ్చే విధంగా చేసినందుకు ఆర్‌టిసి అధికారులకు ప్రయాణికులుకృతజ్ఞతలు తెలిపారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి-గాలివీడు

మండలపరిధిలోని గోరాన్‌చెరువు పంచాయతీ బిసికాలనీ చెందిన దేవకి లక్కిరెడ్డిపల్లి ఐసిడిసి కార్యాలయలో అంగన్వాడీ ఆయా పోస్టుకు దరఖాస్తు చేసుకుంది. జిల్లా పీడీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న యువరాజ్ ప్రభుత్వ పాఠశాల నుంచి తీసుకపోయిన టిసి, స్టడీ సర్టిఫికేట్లు ఒరిజినల్ కాదని దరఖాస్తు తీసు కోకుండా నా దరఖాస్తు తిరస్కరించారని పేర్కొన్నారు. ఆయా పోస్టులు దర ఖాస్తు చేసుకునేందుకు డబ్బులు డిమాండ్ చేశారని, అడిగిన డబ్బులు ఇవ్వకపోవడంతోనే తనదరఖాస్తు తిరస్కరించారని ఆరోపించారు. అతనిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



క్రికెట్ టోర్నమెంటులో విజేతగా నిలిచిన మదనమోనాపురం జట్టు

విజేతగా మదనమోహనాపురం జట్టు

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని చింతకాయలపల్లి గ్రామంలో భోగాంజనేయ స్వామితిరుణాల సందర్భంగా 8వ సీజన్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిం చారు. ఈటోర్నమెంట్‌లో 18జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌లో మదన మోహ నపురం, టంగుటూరు పాల్గొనగా మదన మోహనపురం జట్టు విజేతగా నిలిచింది. ఈ టోర్నమెంటుకు దాతలు బదిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి మొదట బహుమతి రూ.20వేలు, రెండోబహుమతి చుక్క వెంకటేశ్వరయ్య రూ.15వేలు, చుక్కయానాది మదన మోహనపురం (సర్పంచ్) రూ.10 వేలు, చుక్క వెంకటయ్య రూ.10 వేలు, అందజేశారు. ఈ క్రికెట్ టోర్న మెంట్‌కు ఆర్గనైజర్లుగా చుక్కా రమణయ్య, చింతకాయల ఉపేంద్ర, శ్రీను, నాగార్జున, ప్రసాదు, మనీ, రత్నయ్య, పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తులు అందజేత

ప్రజాశక్తి-గుర్రంకొండ

రాష్ట్రస్థాయి ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో జరుగుతున్న అండర్-14 బాస్కెట్‌బాల్ బాల,బాలికల జిల్లా జట్టుకి ఎమర్జెన్సీ హాస్పిటల్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి క్రీడాదుస్తులను బహుకరించారు. మండలంలోని తరిగొండ జడ్పి టిసిలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని రాష్ట్రస్థాయిలో విజే తలుగా నిలిచి జిల్లాకు మంచి పేరు తేవాలని కోరారు. నూజివీడులో ఈనెల 3, 4వ తేదీలలో విటిఎ మైదానంలో రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రెటరీ వనితమ్మ నాగరాజా, పిడిహెచ్ఎం నర్సింలురెడ్డి, ప్రసాద్, షబ్బీర్ పాల్గొన్నారు.



ఉపాధ్యాయుల నుంచి వివరాలు సేకరిస్తున్న డిఇఒ రాఘవరెడ్డి

మన్నూరు పాఠశాలను సందర్శించిన డిఇఒ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పట్టణంలోని మన్నూరు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలను బుధ వారం ఎంఇఒ ఎద్దుల రాఘవరెడ్డి సందర్శించారు. రెండవదశ నాడు-నేడు పనులను ఈసందర్భంగా ఆయన పర్యవేక్షించారు. పరిసరాల పరిశు భ్రతను, వంటశాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి అకడమిక్ ఆడిట్‌లో భాగంగా ప్రధానోపాధ్యాయురాలు పరిమళ ద్వారా విద్యార్థుల హాజరు వంటి విషయాలను చర్చించి తెలుసుకున్నారు. కార్య క్రమంలో ఎంఇఒ వెంకటేష్ నాయక్, సర్వ శిక్ష అభియాన్ కో-ఆర్డినేటర్ శ్రీహరి, ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యంరాజు పాల్గొన్నారు.



మహిళలకు అవగాహన కల్పిస్తున్న బ్యాంకు సిబ్బంది

'ఎపిజిబి' పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-వీరబల్లి

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని క్యాష్ ఆఫీసర్ హనుమంతరావు కోరారు. బుధవారం గ్రామంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు బ్యాంక్ పథకాల గురించి అవగాన కల్పించారు. సీనియర్ సిటిజన్లకు టర్మ్ డిపా జిట్లపై ఒక సంవత్సరానికి వచ్చే వడ్డీతో రూ. 50 వేల వరకు ఎలాంటి పన్ను ఉండదని చెప్పారు. మొబైల్ బ్యాకింగ్, ఇంటర్నెట్ సౌకర్యాలు అందు బాటులో ఉన్నా యన్నారు. డిపాజిట్ నిధులు ముం దుగా డ్రా చేసుకోవచ్చని ,రైతులకు, మహిళా సంఘాలకు, విద్య,వాహన రుణాలకు తక్కువ వడ్డీతో రుణాలు మంజూరు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎఎం ఖాదర్‌వలి, బ్యాంక్ బాషా, సభ్యులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని 14వ వార్డులో బుధవారం కౌన్సిలర్ షేక్ షబానా, జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ ఎస్.ఎ.కరీముల్లా లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు. అనంతరం వార్డులోని ప్రజలకు చెత్త బుట్టలు అందజేశారు. తడి చెత్త, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. అనంతరం వార్డు సచి వాలయసిబ్బంది, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాలను పరిశు భ్రంగాఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలోవార్డు ప్రజలు పాల్గొన్నారు.

యువత దేశానికి వెన్నెముక

ప్రజాశక్తి-కురబలకోట

యువత దేశానికి వెన్నెముక లాంటి వారని సినీ యాక్టర్ మాణ్యం కృష్ణ పేర్కొన్నారు. స్థానిక గోల్డెన్ వాలీ కళాశాలలో బుధవారం ' యువ తరంగ్ ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు, సాధారణ ప్రజానీకానికి చట్టాలపై, రాజ్యాంగం పౌరులకు కలిపిస్తున్న హక్కులు, బాధ్యతల పట్ల ప్రజలను చైతన్య పరచాలనే లక్ష్యంతో యువతరంగ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు వివరించారు. ఆర్థిక సంస్కరణలు దేశపురోగతికి దోహదం చేస్తుందని వెల్ల డించారు. సమాజాన్ని మరింత భాధ్యతాయుతంగా, చైతన్యవంతంగా మార్చడానికి తమవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమాన్ని రాయలసీమ వ్యాప్తంగా విస్తృతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

మెగా వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ప్రోగ్రెసివ్ అలయన్స్ ఫర్ వాలంటరీ ఇనిషియేటివ్ స్వచ్ఛంద సంస్థ (పవి-ఎన్జీవో) ఆధ్వర్యంలో మండలం గూడెంచెరువులో బుధవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరం విజయ వంతమైంది. శిబిరంలో 172 మంది రోగులకు పలు పరీక్షలు నిర్వహించి, మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి శిబి రాన్ని సందర్శించి సంస్థ చేస్తున్న నిస్వార్థ సేవా కార్య క్రమాలను అభినం దించారు. శిబిరంలో ప్రముఖ సర్జన్ డాక్టర్ కిరణ్‌కుమార్, ప్రముఖ స్త్రీ వ్యాధుల వైద్యులు డాక్టర్ స్వప్న వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ వైద్య సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, గ్రామ సర్పంచు, వైసిపి నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, రమణ, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

హెచ్ఐవిపై అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి - చాపాడు

హెచ్ఐవిపై అవగాహన తప్పనిసరి అని డాక్టర్ హేమేంద్ర సింగ్, సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అనంతపురం గ్రామంలో బుధవారం ఎయిడ్స్ నియంత్రణ సంస్థ చైల్డ్ ఫండ్ ఇండియా లింకు వర్కర్స్ స్కీం వారి ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సం దర్భంగా వారు మాట్లా డుతూ హెచ్ఐవి అవ గాహన ద్వారానే దూరం గా ఉండ వచ్చునన్నారు. హెచ్ఐవి సోకడం వలన కలిగే నష్టాలు, తీసు కోవా ల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. 37 మందికి హెచ్ఐవి పరీ క్షలు, సుఖవ్యాధుల పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో చైల్డ్ ఫండ్ వర్క ర్స్ స్కీం సూపర్వైజర్ దర్బార్, వైద్య సిబ్బంది నారాయణరెడ్డి, ఎంపిహెచ్ఒ కీర్తి, ఎఎన్ఎం సుజాత, ఆశా కార్యకర్తలు, సిబ్బంది సురేంద్ర, అమీర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలోకి రండి : తులసిరెడ్డి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాలు నెరవేర్చాలంటే వైసిపి నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరాలని పిసిసి మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి, పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ పిలుపునిచ్చారు. స్థానిక తెలుగుగంగ అతిథిగృహంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ పని అయి పోయిందన్నారు. హాత్‌సేహాత్ జోడ అభియాన్ గోడపత్రాలను వారు ఆవిష్క రించారు. రాహుల్ గాంధీని భారత ప్రధాని చేయడమే తన జీవిత ఆశయమని వైఎస్ పదేపదే చెప్పేవారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నీలి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు నజీర్ అహ్మద్, జకరయ్య, మల్లెం విజయభాస్కర్, మైదుకూరు ఇన్‌ఛార్జి సుబ్బరాయుడు, జోడు నాగరాజు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుమలేష్, జిల్లా మహిళా అధ్యక్షు రాలు శ్యామలమ్మ, ఉత్తన్న, శివయ్య, సత్తార్, అరిపుల్లా, అన్వర్ పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం

ప్రజాశక్తి-కడప అర్బన్

నగరంలోని జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ లో నిరుద్యోగ యువతీ, యువకులకు పలు కోర్సులలో శిక్షణతో పాటు, ఉపాధి పొందే గొప్ప అవకాశాన్ని కల్పిస్తున్నామని స్కిల్ సెంటర్ రీజనల్ కోఆర్డినేటర్ సుబ్బిరామి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన డిడియుజికెవై పథకం కింద నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ కేంద్రంలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, ఫీల్డ్ టెక్నీషియన్ కంప్యూటింగ్ పెరిఫెరల్స్ శిక్షణ మూడు నెలల పాటు ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తున్నామని తెలిపారు. శిక్షణ సర్టిఫికెట్లతో పాటు ఉపాధి కూడా పొందేలా చేస్తున్నామని పేర్కొన్నారు.

రోడ్డు భద్రత వారోత్సవాల్లో రక్తదానం

ప్రజాశక్తి - కడప

34 వ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఐఆర్ఎస్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ ఏరియా హాస్పిటల్లో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని కడప జోన్-4 ఇడి కె. గోపీనాథ్ రెడ్డి, జిల్లా ప్రజా రవాణా అధికారి పి.గోపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తదానం ఎంతో విలువైందని అన్నారు. అన్ని దానాల్లో కల్లా రక్తదానం చాలా గొప్పదని పేర్కొన్నారు. 34వ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా కడప, అన్నమయ్య ఉమ్మడి జిల్లాల డిపోలకు చెందిన 52 మంది ఉద్యోగులు రక్తదానం చేయడం చాలా సంతోషించదగ్గ విషయమని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ మెడికల్ ఆఫీసర్ శ్రీకాంత్ రెడ్డి, డిప్యూటీ సీఎంఈ భాస్కర్, స్టెప్ సీఈఓ సి. సాయి గ్రేస్, స్టెప్ మేనేజర్ వివి సుబ్బారాయుడు పాల్గొన్నారు. రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు.

ప్రజలకు లబ్ధి చేకూరేలా పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ముద్దనూరు

ప్రజలకు లబ్ధి చేకూరేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పథకాలు అమలు చేస్తు న్నారని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పేర్కొ న్నారు. మండలంలో కొసినేపల్లి, తిమ్మాపురం గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకు తిరిగి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సమస్యలను ప్రజలను అడిగి తెలు సుకు న్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రమణారెడ్డి, మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు సుమంత్ యాదవ్, నాయకులు తిరు మలరెడ్డి నాయకలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జగనన్న కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపిపి శ్రీదేవి రవికుమార్

ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయండి : ఎంపిపి

ప్రజాశక్తి-కలకడ

జగనన్న కాలనీలలో ఇంటి నిర్మాణాలను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని ఎంపిపి శ్రీదేవి రవికుమార్ లబ్ధిదారులను కోరారు. బుధవారం మండలంలోని బాటవారిపల్లి పంచాయతీలోని జగనన్న కాలనీని ఆమె సంద ర్శించారు.ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇళ్లను పొందిన లబ్ధి దారులు ఇంటి నిర్మాణాలను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేస్తే ప్రభుత్వ నుండి బిల్లులు వీలైనంత త్వరగా వచ్చేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ చరిస్మాంజలి, భరత్ పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఇఒ రాజగోపాల్

నాణ్యమైన భోజనం అందించాలి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండలపరిధిలోని పిట్టావాండ్లపల్లి ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ రాజగోపాల్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లా డుతూ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని అన్నారు. ప్రభుత్వం నాణ్యమైన విద్యతో పాటు జగనన్న గోరుముద్ద, మధ్యాహ్నం భోజనపథకం ద్వారా విద్యార్థులకు నాణ్యతతో కూడిన పౌష్టి కాహారాన్ని అంది స్తోందని తెలిపారు. మెనూ ప్రకారమే విద్యార్థులకు భోజనాన్ని అందించాలని సూచించారు. పాఠశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికలు, రికార్డులను ఆయన పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యా యులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, రమణారెడ్డి పాల్గొన్నారు.

పంట నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-కంభంవారిపల్లి

రైతులు విధిగా ఇపంట నమోదు చేసుకోవాలని ఎడిఎ వైవి.రమ ణరావు అన్నారు. బుధవారం మండలంలోని గోరంట్లపల్లె, గ్యారంపల్లెలో రబీలో సాగు చేసిన పంటలను, ఇపంట నమోదు కార్యక్రమం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్లో సాగు చేసిన ప్రతి పంటను నమోదు చేయాలని తెలిపారు. ఇపంట నమోదు చేసుకున్న రైతులకు బహుళ ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసా యాధికారి శ్రావణి, సర్పంచ్ రెడ్డెయ్య, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గ్యాస్ ట్యాంకర్ బోల్తా

తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి-చిన్నమండెం

మండలంలోని కేశపురం చెక్‌పోస్ట్ వద్ద కడప-బెంగళూరు జాతీయ రహదారిపై గ్యాస్ ట్యాంకర్ బోల్తాపడింది. స్థానికుల వివరాల మేరకు బెంగు ళూరు నుంచి కడపకు వెళుతున్న గ్యాస్ ట్యాంకర్ అతివేగంగా వచ్చి నిలిచి ఉన్న సిమెంట్ వాహనాన్ని ఢీకొనడంతో అదుపుతప్పి గ్యాస్ ట్యాంకర్ బోల్తా పడినట్లు తెలిపారు. స్థానికులు గమనించి అధికారులకు సమాచారం ఇవ్వగా అధికారులు ఐఒసి ఎమర్జెన్సీ వాహనాన్ని రప్పించి ప్రమాదానికి గురైన ట్యాంకర్‌లో ఉన్న గ్యాస్ మొత్తాన్ని ఎమర్జెన్సీ వాహనంలో నింపి ఎవ్వరికి హాని కలగకుండా కాపాడడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు స్థానిక ఎస్ఐ ఫాతిమా తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాచవేటివారిపల్లి పంచాయతీ మాలపల్లెకు చెందిన రెడ్డప్ప కుమారుడు వీరనాల వెంకటరమణ కర్ణాటక నుండి అక్రమంగా మద్యం తీసు కొచ్చి గ్రామంలో విక్రయిస్తున్నట్లు సమాచారం అందటంతో పోలీసులు నిఘా ఉంచినట్లు తెలిపారు. ఈ క్రమంలో రాచవేటివారిపల్లి గ్రామం మాలపల్లెకు సమీపంలోని చింతచెట్టు వద్ద కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను అక్రమంగా తీసుకొచ్చి అధికధరలకు విక్రయిస్తుండగా బుధవారం ఉదయం పోలీసులు అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



నాకాబందీ నిర్వహిస్తున్న పోలీసులు

నాటు సారా స్థావరాలపై దాడులు

28 వేల లీటర్ల ఊట ధ్వంసం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని నారమాకులతాండ గ్రామంలో బుధవారం ఉదయం తెల్లవారుజామున ఎస్పి హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఇన్‌ఛార్జ్ డిఎస్పి కె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ దాడుల్లో సుమారు 28వేల లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసి, 40 లీటర్ల స్వాదీనం చేసుకొని ఇద్దరిని అరెస్టు, ఏడు ద్విచక్రవాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లా డుతూ అక్రమ నాటుసార తయారు చేయడం చట్ట విరుద్ధమని ఇప్పటికీ పలు మార్లు హెచ్చరించి అనేక కేసులు నమోదు చేశామని తెలిపారు. అక్రమ నాటు సారా తయారు చేస్తున్నవారు ఇకనైనా తమ పద్ధతులు మార్చుకోవాలని లేకున్నా చట్ట పరిధిలో జిల్లా బహిష్కరణకు కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు. మదనపల్లి సబ్‌డివిజనల్ పోలీసుఅధికారులు, సంయుక్తంగా దాడులు నిర్వహించారు. సబ్‌అధికారి రాధాకృష్ణ, మదనపల్లి టూటౌన్ సిఐ ఎస్ మురళీ కృష్ణ, తాలూకా సిఐ సత్యనారాయణ, రూరల్ సిఐ శివాంజనేయులు, ఇఎస్‌బి సిఐ మురళీ కిషోర్, సబ్‌డివిజన్ పరిధిలోని సుమారు పదిమంది ఎస్ఐలు, 80 మంది పోలీసు సిబ్బంది తండా గ్రామపరిధిలోని చుట్టుపక్కల ప్రాంతాలలో కూడా నాకాబంది నిర్వహించారు. అక్రమ నాటు సారా తయారీకి ఉపయోగించే పరికరాలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు వివరించారు. నాకా బంది అనంతరం అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించి అక్రమ నాటు సారా వలన జరిగేటటువంటి అనర్థాలను వివరించారు. గ్రామస్తుల కోరిక మేరకు నిరుద్యోగ యువతకు తమ వంతు సహాయం చేస్తామని తెలిపారు.

www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 2 ఫిబ్రవరి 2023
5
వైఎస్ఆర్



నగరంలో మెరిసిన 'మెహ్రీన్'
- రాజసం హోటల్ ప్రారంభం


హోటల్‌ను ప్రారంభిస్తున్న మెహ్రీన్

కడప అర్బన్ : నగరంలో ప్రముఖ హీరోయిన్ మెహ్రీన్ సందడి చేశారు. ఆమెను చూసేందుకు ప్రజలు ఆసక్తి కనబరిచారు. అభిమానులను ఆప్యాయంగా పలకరించారు. ఏడు రోడ్ల సర్కిల్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన రాజసం హోటల్‌ను హీరోయిన్ మెహ్రీన్ కౌర్ పిర్జాదా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పకుండా రాజసం హోటల్‌లో రుచులను ఆస్వాదించాలని కోరారు.



కేంద్ర బడ్జెట్ నిరాశను మిగిల్చింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2023-24 బడ్జెట్‌ను బుధవారం సుమారు రూ.48 లక్షల కోట్లతో ప్రవేశ పెట్టారు. రాష్ట్ర విభజన చట్టంలోని హామీలైన ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, గనుల కేటాయింపుల ఊసే కనిపించలేదు. రైల్వే బడ్జెట్‌లోనూ కడప-బెంగళూరు రైల్వేలైన్ సహా పెండింగ్ రైల్వే ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. చట్టబద్ధమైన హామీలను విస్మరించి కార్పొరేట్ల భజన చేసింది. ఎంఎస్ఎంఇలకు ప్రోత్సాహకాలు, అద్దె వ్యవసాయపనిముట్ల, ప్రకృతి వ్యవసాయాన్ని ఉటంకించింది. వేతనజీవుల ఆదాయపన్ను రూ.ఐదు లక్షల నుంచి రూ. ఏడు లక్షలకు మినహాయించడం మినహా కొత్తదనం కొరవడింది. 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేయడానికి సంబంధించి వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్ స్వామినాథన్ సిఫార్సులను విస్మరించి గతేడాది వ్యవసాయానికి కేటాయించిన రూ.1.32 కోట్ల నుంచి రూ.1.25 లక్షల అత్తెసరు కేటాయింపులతో సరిపెట్టింది.

నిరాశాజనకమే!

వ్యవసాయానికి కేటాయింపుల్లో తగ్గుదల
ఉక్కు పరిశ్రమ ఊసే లేదు
వేతన జీవులకు ఊరట

ప్రజాశక్తి- కడప ప్రతినిధి/యంత్రాంగం

కేంద్ర బడ్జెట్‌లో పెండింగ్ ప్రాజెక్టుల ప్రస్తావనే కొరవడింది. జిల్లాకు సంబంధించిన పెండింగ్ ప్రాజెక్టుల కేటాయింపుల వివరాలు జాడే కనిపించలేదు. రాష్ట్ర విభజన చట్టంలోని హామీలైన ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, గనుల కేటాయింపు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి పెండింగ్ నిధులు, కడప-బెంగళూరు, కడప-విజయవాడ వంటి రైల్వే ప్రాజెక్టులకు కేటాయింపులు చేయాల్సి ఉంది. రూ.2.41 లక్షల కోట్లతో రైల్వేబడ్జెట్ ప్రస్తావన చేసింది. ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు తెలియడం లేదు. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలనే ప్రధానమంత్రి తన హామీనే విస్మరించి, వ్యవసాయ అనుబంధ రంగాలైన గ్రామీణాభివృద్ధికి నిధులు భారీగా కుదించింది. వ్యవసాయాభివృద్ధికి అరకొరగానే నిధులు కేటాయించింది. ఉమ్మడి జిల్లాలోని సుమారు ఐదు లక్షల మంది రైతుల్లో ఎందరికి ప్రయోజనం చేకూరనుందో తెలియని అనిశ్చితి నెలకొంది. ఉద్యోగుల ఆదాయ పన్ను శ్లాబులను సవరించడం ఊరటను కలిగించింది. ఫలితంగా ఉమ్మడి జిల్లాలోని 32 వేల మంది ఉద్యోగులు, 22,800 మంది పెన్షనర్లకు రిక్తహస్తాన్ని చూపించింది. రాష్ట్ర విభజన జరిగిన తొమ్మిదేళ్లు గడిచిన నేపథ్యంలో వెనుక బడిన ప్రాంతాల అభివృద్ధి నిధుల విడుదల జాడే కనిపించలేదు. జిల్లాలోని పెండింగ్ రైల్వే ప్రాజెక్టులైన కడప- బెంగళూరు, కడప-విజయవాడ, ఓబులవారిపల్లి - కృష్ణపట్నం సివిల్ రైల్వే ప్రాజెక్టులకు కేటాయింపులపై అందరిదృష్టి నిలిచింది. ఉపాధి హామీ పనుల కేటాయింపులు సమాచారం తెలియాల్సి ఉంది. దేశ వ్యాప్తంగా 81 లక్షల స్వయంసహాయక సంఘాలను ఏర్పాటు చేస్తామని హామీనిచ్చింది.

జిల్లాకు రికస్తహస్తమే

కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు రిక్తహస్తమే. రాష్ట్ర విభజన చట్టంలోని వెను కబడిన ప్రాంతాలైన రాయలసీమ, ఉత్తరాంధ్రలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ, విశాఖ రైల్వేజోన్, కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు వంటి ప్రధాన హామీలకు ఏళ్ల తరబడి అన్యాయమే చేస్తోంది. కడప-బెంగళూరు, కడప-విజయవాడ, కృష్ణపట్నం-ఓబులవారిపల్లి ప్యాసింజన్ రైల్వేలైన్, కడప నుంచి రాజధానికి రైలు ప్రస్తావన లేదు. కడప విమానాశ్రయం రన్‌వే పొడిగింపు పనుల కేటాయింపుల ప్రస్తావనే లేదు. వ్యవసాయ రంగ కేటాయింపులను పరిశీలిస్తే రైతుల ఆదాయం రెట్టింపు హామీని తుంగలో తొక్కేసినట్లు అవుతోంది. ప్రధాన మంత్రి హామీకే దిక్కు లేకుండా పోవ డం విస్మయాన్ని కలిగిస్తోంది.

- జి.చంద్రశేఖర్, సిపిఎం జిల్లా కార్యదర్శి, కడప.

మొండిచేయి

జిల్లాకు మొండిచేయి చూపిం చింది. తొమ్మిది రాష్ట్రాల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్ రూపల్పన చేయ డం కనిపించింది. కార్పొరేట్లను ఊడిగం చేయడం దారుణం. రైతాంగానికి కేటాయింపులు తగ్గించడం దారుణం. దేశాన్ని అమ్మకానికి పెట్టినట్లు ఉంది. ఎపికి సంబందించి ఎటువంటి హామీ నెరవేర్చిన పాపానలేదు. ద్రవ్యోల్బణాన్ని పెంచి సామాన్యుల జీవితాలను కడగండ్ల పాలు చేసింది. కడప-బెంగళూరు, విజయవాడ రైల్వేప్రాజెక్టు ఊసేలేదు.

- జి.ఈశ్వరయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి, కడప.


బడ్జెట్ ప్రతులను దగ్ధం చేస్తున్న డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు

బడ్జెట్ ప్రతులు దగ్ధం

కడప అర్బన్ : కేంద్ర బడ్జెట్‌లో కడప ఉక్కును విస్మరించడాన్ని నిరసిస్తూ కడప పూలే సర్కిల్‌లో బడ్జెట్ ప్రతులను డివైఎఫ్ఐ ,ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా నాయకులు వీరనాల శివకుమార్, రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం విభజన హామీలను విస్మ రించిందని అందులో ప్రధానంగా కడప ఉక్కు పరిశ్రమను నిర్లక్ష్యం చేస్తోందని చెప్పారు. గడిచిన ప్రతి పార్లమెంటు, బడ్జెట్ సమావేశాలలో కడప ఉక్కు కు నిధులు కేటాయిస్తారని జిల్లా ప్రజలు, విద్యార్థులు, నిరుద్యోగ యువకులకు ఆశగా ఎదురు చూసారని వారికి ప్రతి సారి నిరాశే ఎదురు అవుతుందని అన్నారు. కడప ఉక్కుపై కేంద్రంతో పోరాడాలని అన్నారు.

రైతు వ్యతిరేక బడ్జెట్

రైతు వ్యతిరేక బడ్జెట్. రూ.48 లక్షల కోట్ల బడ్జెట్ వ్యవసాయానికి గాలికి వొదిలేసింది. దేశంలో 70 శాతం రైతులు ఉండగా, రూ.1.25 లక్షల కోట్లతో సరిపెట్టడం విస్మయాన్ని కలిగించింది. ఈలెక్కన 2.57 శాతం కేటా యింపులు చేయడం దారుణం. 1940 నుంచి 2014 వరకు 13 మంది ప్రధాన మంత్రుల హాయంలో రూ.40 లక్షల కోట్లు అప్పు ఉంటే, మోడీ హయా ంలో నుంచి రూ.1.09 లక్షల కోట్లు అప్పు చేయడం విస్మయకరం. ఈఏడాదికి మరో రూ.15.30 లక్షల కోట్లు అప్పు చేస్తామనడం పేర్కొనడం దారుణం. మొత్తం బడ్జెట్‌ను పరిశీలిస్తే 34 శాతం అప్పులే కనిపించాయి.

- ఎన్.తులసిరెడ్డి, పిసిసి మీడియా చైర్మన్.

రాష్ట్రానికి అన్యాయమే

కేంద్రబడ్జెట్‌లో రాష్ట్రానికి, జిల్లాకు తీరని అన్యాయం. ప్రత్యేక హోదా ఇస్తామని నమ్మించి మోసం చేయడం దారుణం. వెనుకబడిన ప్రాంతాలకు నిధులు కేటాయింపులు, పోలవరం ప్రస్తావనే లేదు. కడప స్టీల్‌ప్లాంట్, కడప-బెంగళూరు రైల్వేలైన్ ఊసే లేకపోవడం దారుణం.

- ఆర్.శ్రీనివాసులరెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షులు.

కార్మిక, ప్రజావ్యతిరేక బడ్జెట్

కేంద్ర బడ్జెట్ కార్మికులకు, రైతులకు, శ్రమ జీవులకు, ప్రజలకు పూర్తిగా వ్యతిరేకంగా ఉంది. దీనిని ప్రజలు అందరూ తిరస్క రించాలి. ఐసిడిఎస్, మధ్యాహ్న భోజనం, జాతీయ ఆరోగ్యమిషన్, జాతీయ విద్యామిషన్, జాతీయ జీవనోపాధులు మిషన్‌లకు కేటాయింపులు పెంచలేదు. ఉపాధి హామీ పథకానికి కేటాయింపులు, పనిదినాలు 200కు పెంచాలి. రోజు వేతనం రూ.600 చేయాలి. అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి పెద్ద ఎత్తున నిధులను కేటాయించి సంక్షేమ పథకాలను వర్తింపజేయాలి.

- పి.శ్రీనివాసులు, సిపిఎం అన్నమయ్య జిల్లా కార్యదర్శి.

విద్యారంగానికి నిధులు శూన్యం

కేంద్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి అధిక నిధులు మంజూరు చేస్తారని అనుకుంటే అంకెలకే పరిమితమైంది. బిజెపి ప్రభుత్వం విద్యా రంగం పట్ల నిర్లక్ష్యం వహిస్తోంది. విద్యా ప్రమాణాలు తగ్గిస్తూ ప్రయివేట్, కార్పొరేట్ విద్యకు ప్రోత్సహిస్తోంది. విదేశీ యూనివర్సిటీలకి రెడ్ కార్పొరేట్ వేసి స్వాగతం పలుకుతోంది. విదేశీ యూనివర్సిటీల అనుమతులు రద్దు చేయాలి. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కోసం రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలి.

- నరసింహ, ఎస్ఎఫ్ఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి.

మధ్యతరగతి ఉద్యోగులకు నిరాశే

భారతదేశంలో ఆదాయం పన్ను లెక్క కట్టేందుకు రెండు పద్ధతులున్నాయి. ఒక ఉద్యోగికి తాజా బడ్జెట్ ప్రతిపాదనల వల్ల సంవత్సరానికి తగ్గే పన్ను భారం రూ.2,500 మాత్రమే. కొత్త రెజీమ్ ఎంచుకున్న ఉద్యోగులకు కొంత లాభం ఉంది. కొత్త రెజీమ్‌లో పొదుపుకు ప్రోత్సాహకాలు ఉండవు. కేంద్ర ప్రభుత్వం తాను అనుకున్న స్టాక్ మార్కెట్ అనుకూల అజెండాను అమలు చేసింది తప్ప ఉద్యోగుల ఆకాంక్ష మేరకు ఆదాయపు పన్ను భారాన్ని తగ్గించలేదు.

- ఎ.రఘునాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి, ఎల్ఐసి ఉద్యోగుల సంఘం, కడప.

ఆకలి సూచికలో వెనుకబాటు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలకు పూర్తిగా వ్యతిరేకంగా ఉంది. కేవలం ప్రైవేటు పెట్టుబడులకు అనుకూలంగా ఉన్న బడ్జెట్‌ను తిరస్కరించాలి. ఆకలి సూచికలో వెనుకబడటం, పోషకాహార లోపం తదితరాలతో బాధపడుతున్న ప్రజానీకానికి బడ్జెట్ ఎటువంటి రక్షణ కల్పించలేదు

- ఎ.రామమోహన్, సిపిఎం నగర కార్యదర్శి, కడప.

వేతన జీవులకు ఊరట

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో ఆదాయ పన్నుల విషయంలో వేతన జీవులకు ఊరట కల్పించినప్పటికి వారికి ఆదాయ సంపాద్జన మార్గాల వైపు బడ్జెట్ కేటాయించి ఉంటే ఇంకా బాగుండేది. యువత కోసం పీఎం కౌశల్ పథకంలో భాగంగా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ల కోసం బడ్జెట్ కేటాయించడం మంచి నిర్ణయం.

- డాక్టర్ రమేష్, ఆర్థిక విశ్లేషకులు, కడప.

కొఠారి కమిటీకి ఆమడదూరం

కొఠారి కమిషన్ విద్యారంగానికి జిడిపిలో 6 శాతం నిధులు కేటాయించాలని చెప్పినా ప్రస్తుత బడ్జెట్లో జిడిపిలో 0.3 శాతం మొత్తం బడ్జెట్లో 2.5 శాతం మాత్రమే కేటాయించడం దారుణం. విద్యా రంగానికి అరకొర నిధులు కేటాయింపు చేయడం ద్వారా విద్యారంగ బాధ్యతల నుండి ప్రభుత్వం తప్పుకుంటున్నట్లు అర్థమవుతోంది. శాస్త్ర, సాంకేతిక రంగాలకు బడ్జెట్‌లో 2 శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా 0.7 శాతం మాత్రమే కేటాయించింది. శాస్త్రీయ ఆలోచన కలిగిన విద్యార్థుల్ని తయారు చేయడానికి అవరోధం ఏర్పడుతుంది.

- లక్ష్మిరాజ, విజయ్‌కుమార్, మహేష్‌బాబు, యుటిఎఫ్ నాయకులు.

'అదాని' అక్రమాలపై ఉన్నత స్థాయి విచారణ

దేశ ప్రజల ఆస్తులు కార్పొరేట్ కంపెనీలు స్వాహా
సిపిఎం జిల్లా విస్తృత సమావేశంలో కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ. గఫూర్ పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్

ప్రజాశక్తి - కడప అర్బన్

దేశ ప్రజల ఆస్తులను కార్పొరేట్ కంపెనీలకు తాకట్టు పెట్టే విధంగా మోడీ ప్రభుత్వం కంకణం కట్టుకుందని, అదాని గ్రూప్ అక్రమాలపై ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ. గఫూర్ తెలిపారు. బుధవారం సిపిఎం జిల్లా కార్యాలయంలో విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగం, పేదరికం, ఆర్థిక అసమానతలు విపరీతంగా పెరిగి పోతుండడంతో ప్రజల జీవనోపాధిపై నిరంతరం దాడులు కొనసాగుతున్నాయని తెలిపారు. వీటికి వ్యతిరేకంగా ఈనెల 22 నుంచి 28 వరకు దేశవ్యాప్త నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 40 శాతానికి పైగా ప్రజల సంపదంతా కేవలం ఒక్క శాతం మంది దగ్గర పోగుపడిందని చెప్పారు. శతకోటీశ్వరుల సంఖ్య 102 నుంచి 166కు చేరిందని తెలిపారు. ఉపాధి అవకాశాలు సృష్టించే మౌలిక వసతులపై ప్రభుత్వ పెట్టుబడులు పెరగాలని కోరారు. ఆదానీ సామ్రాజ్యం కుప్ప కూలిపోతుందని, రూ.10 లక్షల కోట్లు ఆవిరి అయిపోయిందని పేర్కొన్నారు. రూ.18 వేల కోట్ల ఎల్ఐసి షేర్లు దివాలా తీయించారని, ప్రజల సొమ్మును, ఆదానికి దోచి పెట్టారని తెలిపారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు పెంచి ప్రజల పైన భారం మోపారని విమర్శించారు. అవుట్ సోర్స్, కాంట్రాక్టు ఉద్యోగులకు, స్కీం వర్కర్లకు వేతనాల పెంచలేదన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోరాటం ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను, నాలుగు కోడులుగా, పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చారన్నారు. ఎనిమిది గంటల పనిని 12 గంటలకు చేశారని, సమ్మె చేసే హక్కును, సంఘం పెట్టుకునే హక్కును లేకుండా చేస్తున్నారని వాపోయారు. రైతులకు గిట్టుబాటు ధర లేకుండా, పనిముట్లు ఎరువులు ధరలు పెంచారన్నారు. భిన్నత్వంలో ఏకత్వం ఉన్న దేశాన్ని కేంద్రంలో మతోన్మాద బిజెపి పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ లాంటి మత రాజ్యాలుగా మార్చాలని ప్రయత్నిస్తుందని తెలిపారు. మత రాజ్యాల్లో అభివృద్ధి కాలేదని చెప్పారు. ఏ మతం జోక్యం లేకుండా లౌకిక దేశంగా ఉండాలని కోరారు. వామపక్షాలు తెచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని, నిర్వీర్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బడ్జెట్లో నిధులు కోత విధిస్తున్నారని, ఉపాధి కూలి రూ.600 పెంచాలని, 200 రోజులు పని దినాలు కల్పించాలని, పట్టణాలకు విస్తరించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్థల ప్రయివేట్‌పరం చేయటం, రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలు పెంచి స్మార్ట్ మీటర్లు పెట్టడం, రైతులు, ప్రజల పైన భారాల మోపడం కోసం అన్నారు. కార్మిక రైతు, కూలి వ్యతిరేక విధానాలకు, నిరసనగా ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాల అమలు చేస్తున్నారని విమర్శించారు. పెట్టుబడిదారులకు, కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్నారని తెలిపారు. మతోన్మాద బిజెపి నుంచి దేశాన్ని రక్షించడానికి సైనికుల్లా పోరాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామమోహన్, మనోహర్, శివకుమార్, బి.నారాయణ, ఐ.ఎన్. సుబ్బమ్మ, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసులు రెడ్డి, సత్యనారాయణ చారి, దస్తగిరి రెడ్డి, పాపిరెడ్డి, అన్వేష్, లక్ష్మీదేవి, జిల్లా నాయకులు భైరవ ప్రసాద్, చంద్రారెడ్డి, శివకుమార్, ఓబులేష్, సునీల్ కుమార్, గోపాలకృష్ణయ్య, వెంకటేష్, సుబ్బరాయుడు, మహబూబ్ తార, వివిధ మండలాల నుంచి శాఖ కార్యదర్శిలు, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

88 కుట్టు మిషన్లు పంపిణీ

ప్రజాశక్తి - పోరుమామిళ్ల

పట్టణంలోని బ్లెస్డ్ బ్రయాన్ అనాధాశ్రమం వద్ద వితంతు, వికలాంగులు, ఆర్థికంగా వెనుకబడిన 72 మంది మహిళలు, కస్తూరిబా విద్యార్థినులకు కలిపి 88 కుట్టు మిషన్లను ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ వ్యవస్థాపకులు చిత్తా థామస్ రెడ్డి డాక్టర్ గీత ఏరువా దంపతులు బుధవారం ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాసనమండలి సభ్యులు డి.సి గోవిందరెడ్డి , బద్వేల్ శాసనసభ్యులు డాక్టర్ సుధా, ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్ రెడ్డి, మదర్ థెరెసా ఫౌండేషన్ నిర్వా హకులు చిత్తా గిరి ప్రణీత్ రెడ్డి, ప్రజ్వలారెడ్డి, జడ్‌పిసి ముత్యాల ప్రసాద్, తహశీల్దార్ విజయ కుమారి, ఎంపీడీవో పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలపై అవగాహన అవసరం

కడప : వస్తువలు నాణ్యతా ప్రమాణాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని బిఐఎస్ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్) జాయింట్ డైరెక్టర్స్ సుజాత, రమాకాంత్ పేర్కొన్నారు. బుధ వారం కలెక్టరేట్‌లోని విసి హాలులో వస్తువుల నాణ్యత ప్రమాణాలపై జిల్లాలోని అన్ని శాఖల అధికా రులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఇందులో భాగంగా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వస్తువుల కొనుగోలు విషయంలో తీసుకో వాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. లైసెన్స్ లేకుండా విక్రయాలు జరిపే వ్యాపార సంస్థలకు జైలు శిక్ష, జరిమానాలుంటాయని హెచ్చరించారు. సిమెంట్, స్టీల్, మెడికల్ కు చెందిన వస్తువులు, బంగారం, తిను బండారాలు, ఎలెక్ట్రికల్ పరికరాలు తదితర 458 వస్తువులను కొనుగోలు చేసే సమయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని చెప్పారు. అనంతరం వైద్య విధాన పరిషత్ జిల్లా ఓ-ఆర్డినేటర్ హిమదేవి, అనస్థీషియా డిపార్ట్ మెంట్ హెడ్ డాక్టర్ అనిల్, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కృష్ణమూర్తి పలు అభిప్రాయాలను బిఐఎ ప్రతినిధులకు తెలియజేశారు.

ఆర్‌జెడిగా ఎస్.రవి



కడప అర్బన్ : నూతన ఆర్జెడిగా ఎస్. రవి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆర్ఐఒగా పనిచేశారు. ఆయన చేసిన సేవలను గుర్తించిన అధికారులు ఉద్యో గోన్నతిపై కడప ఆర్‌జెడిగా నియ మించారు. ఈ సందర్భంగా ఆర్‌జెడి మాట్లాడుతూ అధికా రులు తన మీద పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యారంగాన్ని అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ప్రజాదరణ పొందుతానని పేర్కొన్నారు.

బాల్య వివాహాలను కట్టడి చేయాలి

ప్రజాశక్తి - కడప

బాల్య వివాహాలను కట్టడి చేయడంలో ముస్లిం మత పెద్దల పాత్ర చాలా కీలకమైందని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారి ఎం.ఎన్. రాణి సూచించారు. బుధవారం భేటీ బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని జిల్లాలో ఉన్న ముస్లిం మత పెద్దలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ, పట్టణ స్థాయిల్లో ప్రభుత్వ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ ఇంకా బాల్యవివాహాలు జరగుతున్నాయని తెలిపారు. వివాహాలకు ఆడపిల్లలకు 18 ఏళ్లు, మగపిల్లలకు 21 ఏళ్లు పూర్తయి ఉండాలని చెప్పారు. ప్రభుత్వం కేజీ నుంచి పీజీ వరకు ఉచితంగా విద్యను అందిస్తోందని ఖురాన్ నేర్చుకోవడానికి వచ్చే ప్రతి ఒక్కరికీ బాల్యవివాహాలపై అవగాహన కల్పించాలి అని తెలిపారు. జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కృష్ణ కిషోర్ మాట్లాడుతూ రోజురోజుకూ సమాజంలో బాలికల పట్ల నేరాలు బాగా పెరిగాయన్నారు. వాటిని తగ్గించాలంటే మతగురువులు విరివిగా ఆడపిల్ల ప్రాముఖ్యత గురించి ప్రజలను ప్రభావితం చేయాల్సిన అవసరముందని తెలిపారు. అనంతరం ముస్లిం మతపెద్దలకు (ఖాజీలకు) జిల్లా బాలల పరిరక్షణ అధికారి బి.ఆర్ సుభాష్ యాదవ్ జేజే యాక్ట్ 2015, పోక్సో యాక్ట్ 2012, బాలల హక్కులు, భేటీ బచావో బేటి పడావో పథకం, బాల్య వివాహ నిషేధ చట్టం -2006 గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా యందలి ముస్లిం మతపెద్దలు డిసిపియు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

వల్లూరు : విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఎస్-ఎస్ఎ పిఒ డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో గాయత్రి సేవా ట్రస్ట్ చైర్మన్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మోడల్ స్కూల్ పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పైన సూచనలు సలహాలు అందించారు. వందమంది విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో గాయత్రి సేవా ట్రస్ట్ సెక్రటరీ , ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ సురేష్ బాబు , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాశినాయన ఎస్ఐగా హరిప్రసాద్



కాశినాయన : మండల సబ్ ఇన్‌స్పెక్టర్‌గా హరిప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ ఎర్రగుంట్లకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా హరి ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలు లాండ్ ఆర్డర్ ప్రకారం విధులు నిర్వహిస్తానని చెప్పారు. మట్కా, జూదం, అసాంఘిక కార్యక్రమాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నానని తెలిపారు. బాధితులు ఎవరైనా ధైర్యంగా స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయవచ్చని వారికి తగిన న్యాయం చేస్తానని పేర్కొన్నారు.

సామాజిక సేవలో భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి- కడప అర్బన్

విద్యార్థులు సామాజిక సేవలో భాగస్వాములు కావాలని లిటిల్ ప్లానెట్‌స్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ మహమ్మద్ పేర్కొన్నారు. బుధవారం నగరం సమీపంలో ఉన్న ఆజాద్ నగర్‌లోని బృంద వృద్ధాశ్రమ వృద్ధులకు విద్యార్థుల చేతుల మీదుగా రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే విద్యార్థులను సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనేలా తల్లి దండ్రులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమం ఫౌండర్ బాల సుబ్బయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళకు రక్తదానం

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్

పట్టణంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రులో కాశినయన మండలం మిద్దెల గ్రామానికి చెందిన ఓబులమ్మకు అత్యవసరంగా ఓ పాజిటివ్ రక్తం అవసరమైంది. బాధిత కుటుంబ సభ్యులు రైట్ హ్యాండ్ ఆర్గనేషన్ స్థాపకులైన షేక్ నాయబ్ రసూల్‌ను సంప్రదించగా రసూల్ వెంటనే స్పందించి రాజశేఖర్ అనే వ్యక్తిచే రక్తదానం చేయించారు. దాతను సంస్థ డైరెక్టర్ ప్రసాద్, పలువురు అభినదించారు.

3న ఎస్‌టియు సాధన దీక్ష

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఒపిఎస్ సాధన కోసం ఈనెల 3న ఎస్‌టియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఒపిఎస్ సాధన దీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు పి.రమణారెడ్డి, జి.చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం కడపలోని వివిఆర్ ఎస్టీయు భవన్ లో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వారంలోపు సిపిఎస్‌ను రద్దు చేస్తానని చెప్పి, జిపిఎస్‌ను గ్యారెంటీ పెన్షన్ స్కీం అంటూ కొత్త ప్రతిపాదనలు తీసు కురావడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. సందర్శనల పేరుతో విద్యాశాఖ ఉన్నతాధికారులు ఉపాధ్యాయులను వేధించడం మానుకోవాలన్నారు. అధికారులు తీరుతో ఉపా ధ్యాయులు తీవ్ర మానసిక ఆందోళనతో విధులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొందని పేర్కొన్నారు. జిల్లాలోని ఉద్యోగ,ఉపాధ్యాయులు, ఎస్టీయు నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున దీక్షకు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

వైసిపి తొత్తులుగా పోలీసులు : టిడిపి

కడప అర్బన్ : వైసిపి తొత్తులుగా పోలీసులు వ్యవహరిస్తున్నారని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరి ప్రసాద్ విమర్శించారు. బుధవారం హరి టవర్స్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమాలను అరికట్టాల్సిన పోలీసులే అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారని విమర్శించారు. సికె దిన్నె మండలంలోని కొన్ని ఏళ్లుగా గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తూ వస్తున్నారని చెప్పారు. స్థానిక మహిళలు అక్రమ రవాణాపై కలెక్టర్‌కు పిర్యాదు చేయగా ఆయన ఆదేశాల మేర మైనింగ్ అధికారులు దాడులు నిర్వహించారన్నారు. దాడుల్లో రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకుని సికెదిన్నె పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేశారన్నారు. కాసేపటికే సిఐ, ఎస్ఐ వచ్చి పిర్యాదును స్వీకరించకుండా వాహనాలను మైనింగ్ అధిదారులకే అప్పగించడం దారుణమన్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆ వాహనాలను మైనింగ్ అధికారులు ఆర్టీసీ గ్యారేజ్‌లో ఉంచారన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సహజ వనరుల దోపిడీని అరికట్టాలని కోరారు. సమావేశంలో నాగరాజు రాంప్రసాద్ పాల్గొన్నారు.

పిఎల్ఐ సేవలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

అర్హులైన వారు పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ సేవలను వినియోగించుకోవాలని పోస్టల్ సూపరింటెండెంట్ షేక్ గౌస్ ఆజాం కోరారు. బుధవారం పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ 140వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న శుభ సందర్భంగా ప్రజలకు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అర్హులైన వారు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎస్‌పిలు ఎం. విజయ భాస్కర్, రామశంకర్, ఇన్‌స్పెక్టర్ రెడ్డి బాషా, పిఎల్ఐ డెవలప్మెంట్ ఆఫీసర్ మునాఫ్, గణేష్, సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న గౌస్ ఆజాం

అమ్మాయిల రక్తదానం అందరికీ ఆదర్శం

ప్రజాశక్తి -కడప అర్బన్


రక్తదాన శిబిరంలో అతిథులు

రక్తదానం చేయాలంటేనే భయపడుతున్న నేటి సమాజంలో అమ్మాయిలు ముందుకొచ్చి రక్తదానం చేయడం గర్వించదగ్గ విషయమని జిల్లా ఆరోగ్యశాఖ అధికారి నాగరాజు పేర్కొన్నారు. బుధవారం నోబుల్ సేవా సంస్థ ఆధ్వర్యంలో నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన రక్తదానం శిబిరానికి డిఎంహెచ్ఒ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్త కొరత లేని సమాజం యువతతోనే సాధ్యమన్నారు. ప్రతి నెల రక్తదానం శిబిరాలు నిర్వహించడంతో పాటు యువత ముందుకొచ్చి మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త వెంకట్రామిరెడ్డి, నెహ్రూ యువ కేంద్రం కో-ఆర్డినేటర్ కె. మణికంఠ మాట్లాడుతూ అమ్మాయిలతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం మొదటిసారిగా చూస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో ఇది అందరికీ మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో నోబుల్ సేవా సంస్థ వ్యవస్థాపకులు వెంకటసుబ్బయ్య, రామాంజనేయులు, కిరణ్ గంగిరెడ్డి, సభ్యులు బాలకృష్ణ, రాణా ప్రతాప్, కళాశాల ఎన్ఎస్ఎస్ పిఓలు, వాలంటీర్లు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

నేటి నుంచి లూర్దు మాత తిరుణాల

ప్రజాశక్తి - కడప అర్బన్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఫాదర్ బిరుసు రాజా

మరియాపురంలోని లూర్దు మాత తిరునాళ్ల మహోత్సవం ఈనెల 2 నుంచి 11 వరకు నిర్వహిస్తున్నట్లు ఫాదర్ బిరుసు రాజా తెలిపారు. బుధవారం లూర్దు మాత ప్రార్థన మందిరం ప్రాంగణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10న డాన్ బోస్కో ఐటిఐ నుంచి మరియాపురం వరకు ఊరేగింపు ఉంటుందని పేర్కొన్నారు. 11న వాలీబాల్ ఫైనల్ పోటీలు, భక్తులకు అన్నదానము, చెక్కభజన, ఎద్దుల బండలాగు పోటీలు, బహుమతుల ప్రధానం, సాంఘిక నాటిక ఉంటాయని తెలిపారు. తిరుణాల మహోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం తిరునాళ్ల పోస్టర్లు ఆవిష్కరించారు. సమావేశంలో కమిటీ అధ్యక్షులు జోసెఫ్, ఉపాధ్యక్షులు విజయకుమార్, కార్యదర్శి లూర్దు, కోశాధికారి విజయభాస్కర్, సంయుక్త కార్యదర్శి ఆనంద్, ఈసీ మెంబర్ ఆల్ ఫోన్స్ విజయరాజు జోజప్ప పాస్టర్ కైపు చంద్ర పాల్గొన్నారు.

ఎన్టీఆర్ అభిమానికి సత్కారం

కడప అర్బన్ : సినీరంగ రారాజు, నటరత్న కీ.శే. ఎన్ టి రామారావు శతజయంతి ఉత్సవాల శుభ సందర్భంగా అభిమాని దస్తగిరిని సత్కరించారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి టిడిపి నగర ఉపాధక్షులు కొండా సుబ్బయ్య మాట్లాడుతూ రామారావు సినీ రంగంలో రాముడుగా, కృష్ణుడుగా ఎన్నో పాత్రలను జీవించారని పేర్కొన్నారు. అలాగే తెలుగు ప్రజల కోసం తెలుగుదేశం పార్టీని స్థాపించి ఎన్నో సంక్షేమ పథకాలు అందించాలని తెలిపారు.

మెగా వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ప్రోగ్రెసివ్ అలయన్స్ ఫర్ వాలంటరీ ఇనిషియేటివ్ స్వచ్ఛంద సంస్థ (పవి-ఎన్జీవో) ఆధ్వర్యంలో మండలం గూడెంచెరువులో బుధవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరం విజయవంతమైంది. శిబిరంలో 172 మంది రోగులకు పలు పరీక్షలు నిర్వహించి, మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి శిబిరాన్ని సందర్శించి సంస్థ చేస్తున్న నిస్వార్థ సేవా కార్యక్రమాలను అభినందించారు. శిబిరంలో ప్రముఖ సర్జన్ డాక్టర్ కిరణ్‌కుమార్, ప్రముఖ స్త్రీ వ్యాధుల వైద్యులు డాక్టర్ స్వప్న వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో స్థానిక ప్రభుత్వ వైద్య సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, గ్రామ సర్పంచు, వైసిపి నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, రమణ, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.


రోగులను పరీక్షిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి

హెచ్ఐవిపై అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి - చాపాడు

హెచ్ఐవిపై అవగాహన తప్పనిసరి అని డాక్టర్ హేమేంద్ర సింగ్, సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అనంతపురం గ్రామంలో బుధవారం ఎయిడ్స్ నియంత్రణ సంస్థ చైల్డ్ ఫండ్ ఇండియా లింకు వర్కర్స్ స్కీం వారి ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్ఐవి అవగాహన ద్వారానే దూరంగా ఉండ వచ్చున్నారు. హెచ్ఐవి సోకడం వలన కలిగే నష్టాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. 37 మందికి హెచ్ఐవి పరీక్షలు, సుఖవ్యాధుల పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో చైల్డ్ ఫండ్ వర్కర్స్ స్కీం సూపర్వైజర్ దర్బార్, వైద్య సిబ్బంది నారాయణమ్మ, ఎంపిహెచ్ఇఓ కీర్తి, ఎఎన్ఎం సుజాత, ఆశా కార్యకర్తలు, సిబ్బంది సురేంద్ర, అమీర్ పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కాంగ్రెస్ పార్టీలోకి రండి : తులసిరెడ్డి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాలు నెరవేర్చాలంటే వైసిపి నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరాలని పిసిసి మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి, పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ పిలుపునిచ్చారు. స్థానిక తెలుగుగంగ అతిథిగృహంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ పని అయిపోయిందన్నారు. హాత్‌సేహాత్ జోడో అభియాన్ గోడపత్రాలను వారు ఆవిష్కరించారు. రాహుల్ గాంధీని భారత ప్రధాని చేయడమే తన జీవిత ఆశయమని వైఎస్ పదేపదే చెప్పేవారని గుర్తు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నీలి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు నజీర్ అహ్మద్, బకరయ్య, మల్లెల విజయభాస్కర్, మైదుకూరు ఇన్‌ఛార్జ్ సుబ్బరాయుడు, జోడు నాగరాజు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుమలేష్, జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్యామలమ్మ, ఉత్తన్న శివయ్య, సత్తార్, అరిపుల్ల, అన్వర్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్


ఘర్షణలో తీవ్రంగా గాయపడిన వ్యక్తులు

సుంకేసులలో ఘర్షణ.. పలువురిపై కేసు నమోదు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని సుంకేసుల గ్రామంలో బుధవారం ఇరు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ఎస్ఐ కుళ్లాయప్ప తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన విశ్వనాథరెడ్డి, వెంకట్‌రెడ్డి కుటుంబాల మధ్య చిన్నపాటి సమస్యలు తలెత్తుతుండేవన్నారు. నివాసాలకు సమీపంలో వ్యర్థనీరు, చెత్తాచెదారం వల్ల ఆ ప్రాంతం అపరిశుభ్రంగా మారుతున్నాయని వాదనకు దిగుతుండేవారన్నారు. ఈ క్రమంలో ఘర్షణకు పాల్పడ్డారని తెలిపారు. వెంకటరెడ్డికి బలమైన గాయాలయ్యాయన్నారు. గాయపడిన వారిని రిమ్స్‌కు తరలించి, విచారిస్తున్నామన్నారు. ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మద్యానికి బానిసగా మారి మనస్థాపానికి గురై కార్తీక్‌కుమార్‌రెడ్డి (27) చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన బుధవారం ప్రొద్దుటూరు రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మృతుడి తండ్రి తెలిపిన వివరాల ప్రకారం.. గోపవరం పంచాయతీ అంజనాద్రి నగర్‌లో నివాసం మన్నే రామసుబ్బారెడ్డికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు మురళీధర్‌రెడ్డి ఆర్మీలో పనిచేస్తుండగా, రెండవ కుమారుడు కార్తీక్ కుమార్‌రెడ్డి పదవ తరగతి వరకు చదువుకొని కారు డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. కార్తీక్ మద్యానికి బానిసై ఏ పనిచేయకుండా ఎప్పుడూ మద్యానికి డబ్బులు ఇవ్వాలని తల్లిదండ్రులను వేధించడం, ఇవ్వకపోతే ఇంటి నుంచి వెళ్లిపోవడం, మళ్లీ ఇంటికి రావడం చేస్తుండేవాడు. మంగళవారం మద్యానికి డబ్బులు ఇవ్వమని గొడవ చేయగా నా దగ్గర లేదు అన్నందుకు కార్తీక్ ఇంటి నుండి వెళ్లిపోయాడని రామసుబ్బారెడ్డి తెలిపాడు. మళ్లీ వస్తాడులే అనుకున్న సమయంలో ఆచార్య కాలనీ ఎదురుగా ఉన్న బైపాస్ రోడ్డులోని రాజారెడ్డి వెంచర్ చెట్టుకు ఉరివేసుకొని చనిపోతున్నానని తల్లిదండ్రులకు ఫోన్ చేసి తెలిపాడు. వారు వెళ్లేలోపే చెట్టుకు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడని అన్నాడు. ఆస్పత్రికి తీసుకెళ్లినా ఫలితంలేదని తెలిపాడు. తండ్రి రామసుబ్బారెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారిస్తున్నారు.

పోలీస్ బందోబస్తు మధ్య హైవే భూ సర్వే

ప్రజాశక్తి - చాపాడు

రైతులు తమ భూములను ప్రభుత్వ ధరలకు ఇవ్వలేమని నిరసన తెలియజేస్తుండగా.. అధికారులు ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి ఉందని పోలీస్ బందోబస్తు మధ్య గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకు సంబంధించి భూ సేకరణకు సర్వే నిర్వహిస్తున్నారు. బుధవారం మండల పరిధిలోని ద్వారకా నగర, జడ్జి గారి కొట్టాలు గ్రామాల మధ్య బెంగళూరు-విజయవాడ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే సర్కిల్‌కు సంబంధించి 93 ఎకరాల భూ సేకరణలో భాగంగా తహాశీల్దార్ సుభాని ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. గత కొన్ని రోజులుగా ఈ సర్వే చేసేందుకు రైతులు అడ్డుకుంటున్న విషయం తెలిసిందే. ప్రభుత్వం భూములు కోల్పోతున్న రైతులకు నష్ట పరిహారం ఎంత చెల్లించేది స్పష్టమైన ప్రకటన ఇచ్చేవరకు సర్వే ముందుకు సాగనీయబోమని రైతులు పేర్కొంటున్నారు. ఇందులో భాగంగా మంగళవారం సర్వే సిబ్బందిని రైతులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం తెల్లవారుజాము నుంచే తహాశీల్దార్ సుభాని, ఎస్ఐ రాజు ఆధ్వర్యంలో పోలీస్ బలగాల మధ్య సర్వే ప్రారంభించారు. అడ్డు చెప్పేందుకు వచ్చిన రైతులను ప్రస్తుతం హద్దులు గుర్తిస్తామని అధికారులు సర్ది చెప్పారు. హద్దులు గుర్తించిన తర్వాత ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్తామని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సర్వేయర్ సాయిలత, విఆర్ఓ సుబ్బన్న, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.


సర్వేను పర్యవేక్షిస్తున్న తహాశీల్దార్, ఎస్ఐ

'ఉపాధి హామీ'ని వ్యవసాయానికి అనుసంధానించాలి


సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ప్రజాశక్తి - చాపాడు

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రైతులకు ఉపయోగపడేలా కేంద్ర ప్రభుత్వం వ్యవసాయానికి అనుసంధానం చేయాలని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి సూచించారు. మండలంలోని అల్లాడుపల్లె గ్రామంలో బుధవారం నూతన సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధి హామీని వ్యవసాయానికి అనుసంధానం చేయడం వల్ల రైతులు, కూలీలకు ప్రయోజనం కలుగుతుందన్నారు. మూడు రాజధానుల బిల్లుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తెలుగు నూతన సంవత్సరం నాటికి వందశాతం విశాఖపట్నం పరిపాలన రాజధానిగా మారుతుందన్నారు. రాజధాని ఎక్కడ ఉండాలనేది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ ఇష్టమన్నారు. మూడున్నరేళ్లగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిపై గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తున్నామన్నారు. ఎన్నికలకు ముందు చెప్పినవి వందశాతం చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. నారా లోకేష్ పాదయాత్రకు ప్రజాదరణ లేదన్నారు. బాదుడే బాదుడు ఆదరణ లేకపోవడంతో ఇదేం కర్మరా మాకు చేపట్టి ప్రజల్లోకి వెళ్లలేని పరిస్థితిలో టిడిపి ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి టి.లక్ష్మమయ్య, తహశీల్దార్ సుభాని, ఇఒపిఆర్‌డి రాధాకృష్ణవేణి, పీఆర్ ఎఇ ఈశ్వరయ్య, వెలుగు ఎపిఎం వెంకటరమణ, ఉపాధి ఎపిఒ పద్మారాణి, ఐసిడిఎస్ సూపర్వైజర్ రాజ్యలక్ష్మి, జెడ్పిటిసి భర్త శాంతరాజు, వైసిపి నాయకులు గోసుల కృష్ణారెడ్డి, మాజీ సర్పంచు వీరయ్య, మహేశ్వర్‌రెడ్డి, వెంకటరెడ్డి, మడూరు వినయ్‌కుమార్‌రెడ్డి, రమణయ్య, ప్రసాద్, రామాంజనేయుల రెడ్డి, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి రఘునాథ్ పేర్కొన్నారు. స్థానిక పట్టణ పరిధిలోని అగ్నిమాపక కేంద్రాన్ని బుధవారం ఇంటర్నేషనల్ ఓన్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి విద్యార్థులకు అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన కల్పించారు. మంటలను అదుపు చేసేందుకు వినియోగించే పలు పరికరాల పనితీరును వివరించారు. గ్యాస్ వినియోగం, ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మంటలను ఆర్పే పద్ధతులను తెలియజేశారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్ మెన్స్ అన్వర్ బాషా, నరసింహులు, వెంకటేశ్వర్లు, ఫైర్ మెన్స్ రాజశేఖర్‌రెడ్డి, జాలయ్య, రవికుమార్, డ్రైవర్ ఆపరేటర్లు చిన్న, శ్రీనివాసులురెడ్డి, పాఠశాల పిఇటి విక్రమ్‌సింగ్, నవీన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


గ్యాస్ మంటలు ఆర్పే విధానాన్ని ప్రయోగాత్మకంగా చేస్తున్న సిబ్బంది

బిసి సంఘం అధ్యక్షులుగా బైరవుడు

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు నియోజకవర్గం బిసి అధ్యక్షులుగా మండల పరిధిలోని గుంత చియ్యపాడు గ్రామానికి బత్తల బైరవుడును ఎన్నుకున్నారు. మండలంలోని అల్లాడుపల్లి దేవ స్థానంలో బుధ వారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిమాండ్ చట్టసభల్లో బిసిలకు కేంద్రం వెంటనే రిజర్వేషన్ కల్పించాలన్నారు. బిసి జనగణను కేంద్రం వెంటనే చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా బిసి సంఘం అధ్యక్షులు బత్తల లింగమూర్తి, జిల్లా మహిళా అధ్యక్షురాలు వల్లూరు నారాయణమ్మ, ప్రొద్దుటూరు నియోజకవర్గ బిసి సంఘం అధ్యక్షులు బొర్రా రామాంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు రాముడు, మహిళా అధ్యక్షురాలుగా రామలక్షుమ్మ, ఉపాధ్యక్షులుగా కత్తి నాగులును, కార్యవర్గ సభ్యులుగా మార్కండేయ, పద్మావతి, గోర్ల రమణయ్య, గోర్ల లక్షుమయ్య, దస్తగిరి, హుస్సేన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గుంతచియ్యపాడు లక్ష్మిరెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా నాయకులు బత్తల లింగమూర్తి

'టాలెంట్ హంట్' ఎంపికలకు విశేష స్పందన

ప్రజాశక్తి - కడప

జిల్లాలోని గ్రామీణ ప్రాంతానికి చెందిన ఫాస్ట్ బౌలర్ల కోసం వైఎస్ఆర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాకు ప్రాతినిధ్యం వహించని ఫాస్ట్ బౌలర్ల కోసం "టాలెంట్ హంట్" ఎంపికలను బుధవారం స్థానిక వైయస్ రాజారెడ్డి ఏసీ ఏ స్టేడియంలోని క్రికెట్ నెట్స్ లో నిర్వహించారు. టాలెంట్ హంట్ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి 110 మంది క్రికెట్ బౌలర్లు హాజరయ్యారు. ప్రతిభ గల పరిచిన 35 మంది బౌలర్లను ఎంపిక చేసినట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం. భరత్ రెడ్డి, కార్యదర్శి ఏ. రెడ్డి ప్రసాద్, ఎసిఎ సౌత్ జోన్ అకాడమీ కన్వీనర్ సంజయ్ కుమార్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి పృధ్వి తేజ్, డి సి ఓ ఎస్. కాజా మైనుద్దీన్ తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు విష్ణు మోహన్, ఈశ్వర్, మాజీ ఫస్ట్ క్లాస్ ప్లేయర్ పైడికాల్వ విజయకుమార్, నాగేంద్ర స్వామి, ఎల్. ముని కుమార్ రెడ్డి పాల్గొన్నారు.


బౌలర్ల ఎంపికలకు హాజరైన క్రీడాకారులతో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు

పాత పెన్షన్ పునరుద్ధరణకు సంకల్ప దీక్ష : యుటిఎఫ్

బద్వేలు : కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని తక్షణమే రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యుటిఎఫ్) ఆధ్వర్యంలో ఈనెల 3న కృష్ణా జిల్లాలోని గన్నవరంలో ధర్మస్థలిలో సంకల్ప దీక్ష నిర్వహించనున్నట్లు యుటిఎఫ్ కడప జిల్లా అధ్యక్షులు మాదన విజయకుమార్ తెలియజేశారు. బుధవారం సాయంత్రం బద్వేలులోని స్థానిక ఎంఆర్‌సి వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల జీవిత భద్రతకు ముప్పుగా పరిణమిస్తున్న 'కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం' రద్దుచేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరిస్తానని ముఖ్యమంత్రి పాదయాత్రలో ఇచ్చిన హామీ ఇప్పటి వరకు నెరవేర్చకపోగా, ఇప్పుడు మరో కొత్త పెన్షన్ విధానం 'గ్యారంటెడ్ పెన్షన్ విధానం'' అమలుచేస్తామని ప్రతిపాదించడం, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఎంతమాత్రమూ ఆమోదయోగ్యం కాదని చెప్పారు. ఇది ఉద్యోగ, ఉపాధ్యాయులను మరోసారి వంచించడమేనని ఆయన విమర్శించారు. ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న గ్యారంటీ పెన్షన్ విధానం వల్ల సిపిఎస్ విధానంలో కంటే కొద్దిపాటి ప్రయోజనాలు అదనంగా చేర్చినప్పటికీ అది ఉద్యోగులకు విరమణ అనంతరం భద్రత కలిగించేవిగా లేవన్నారు. సంకల్ప దీక్షలో ప్రతి ఒక్క ఉద్యోగ, ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు ఎస్.శశిధర్ కుమార్, బద్వేలు మండల అధ్యక్షులు టి.శివప్రసాద్, జిల్లా కౌన్సిల్ సభ్యులు పి.చక్రపాణి పాల్గొన్నారు.

'యువగళం'తో జగన్‌కు గుబులు

ప్రజాశక్తి - కడప అర్బన్

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ యువగళం పాదయాత్రతో సిఎం జగన్‌కు గుబులు పట్టుకుందని టిడిపి నగర ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య పేర్కొన్నారు. బుధవారం టిడిపి జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్మోహన్ రెడ్డి సొంత పార్టీలో వ్యతిరేకతపై దృష్టి సారించాలని, సుమారు 35 మంది మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు మంత్రులు, మరో ఇద్దరు ఎంపీలు వైసీపీని వీడాలని ఉన్నారని కోటంరెడ్డి పేర్కొన్నారని చెప్పారు. రాష్ట్రంలో వైసిపి భూస్థాపితం అయ్యే రోజులు దగ్గర పడ్డాయని విమర్శించారు. అన్ని వర్గాల ప్రజాభిమానంతో రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి165 స్థానాల్లో గెలవనుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో టిడిపి బిసి సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు నాదెళ్ల దస్తగిరి, 5,22,47 డివిజన్ ఇన్‌ఛార్జీలు జయశేఖర్, శ్రీనివాసులు, జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బయ్య

జెఎన్‌టియు కళాశాల ప్రిన్సిపల్‌గా వసుంధర

పులివెందుల రూరల్ : పులివెందుల జెఎన్‌టియు కళాశాల ప్రిన్సిపల్‌గా ప్రొఫెసర్ ఎస్.వసుంధర బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తామన్నారు. వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఆర్.రమణారెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పచ్చదనం పెంచడమే ఎఫ్ఇఎస్ లక్ష్యం

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ఫౌండేషన్ ఫర్ ఎకలాజికల్ సెక్యూరిటీ సంస్థ మదనపల్లి వారి ఆధ్వర్యంలో జమ్మలమడుగు ప్రభుత్వ ఐటిఐ కాలేజీ ఆవరణలో మాస్టర్ ట్రైనర్స్ లావణ్య, రామకృష్ణ, కాలేజి ప్రిన్సిపల్, సిబ్బంది ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్స్ రామకృష్ణ, లావణ్య మాట్లాడుతూ పచ్చదనం పెంచడమే తమ సంస్థ ముఖ్య లక్ష్యమన్నారు. అడవులను సంరక్షించడం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. మండలంలో కొండ, గుట్టను మోడల్‌గా తీసుకొని గ్రామస్తులతో కమిటీ వేసి వాటిని పెంపొందిస్తామన్నారు. రోజురోజుకూ అడవులు తగ్గిపోతున్నాయని తెలిపారు. పీల్చే గాలి కలుషితమై రానున్న రోజుల్లో తీవ్ర ఇబ్బందులకు గురవుతామన్నారు. ప్రతి ఒక్కరు పచ్చదనం పెంపొందించడంలో భాగస్వామి కావాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాలేజి యాజమాన్యం, సిబ్బంది, ఎఫ్ఇఎస్ ఫీల్డ్ సిబ్బంది రుబీనా, విద్యార్థులు పాల్గొన్నారు.


మొక్కలను నాటుతున్న ఫౌండేషన్ సభ్యులు

వెనుకబడిన విద్యార్థులను గుర్తించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారికి ప్రత్యేకంగా విద్యా బోధన చేయాలని మండల అబ్జర్వర్ చెరుకూరు శ్రీనివాసులు సూచించారు. మండలంలోని టి.వెలమవారిపల్లె ప్రాథమిక పాఠశాలలో బుధవారం లిప్ కార్యక్రమంలో భాగంగా పిటి-1లోని విద్యార్థుల గ్రేడులపై ఉపాధ్యాయులతో ఆయన చర్చించారు. వెనుకబడిన విద్యార్థులకు బోధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు అందించే విద్యా బోధనపై ప్రత్యేకదృష్టి పెట్టాలన్నారు. స్టడీ అవర్స్ నిర్వహించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులు ముందు వరుసలో వచ్చేలా విద్యా బోధన చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న చెరుకూరు శ్రీనివాసులు

మహిళకు రక్తదానం

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ఆపదలో ఉన్న మహిళకు ఎబి పాజిటివ్ రక్తాన్ని అందించినట్లు మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ చైర్మన్ లక్ష్మణ్‌రావు తెలిపారు. స్థానిక క్యాంబెల్ ఆసు పత్రిలో చికిత్స పొందుతున్న ఎఎస్ రసూల్‌బీ అనే మహిళకు ఎబి పాజిటివ్ రక్తం అవసరంకాగా, వారు మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణ్‌రావును సంప్రదించారు. ఆయన వెంటనే పట్టణంలోని కెనరా బ్యాంక్‌లో గోల్డ్ అప్రైజర్‌గా ఉన్న ఎస్.సుధీర్ అనే వ్యక్తి చేత రక్తదానం చేయించారు. రక్తదాత సుధీర్‌కు మహిళ తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మోరే లక్ష్మణ్‌రావు, గురు రాజశేఖర్ పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న సుధీర్

ప్రభుత్వ డిగ్రీ కళాశాల తనిఖీ

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పట్టణ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను బుధవారం కడప ఆర్‌జెడి డాక్టర్ పి.బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కళాశాల రికార్డులను తనిఖీ చేశారు. సిబ్బంది రిజిష్టర్‌ను పరిశీలించారు. అనంతరం కళాశాలలోని సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యా ర్థులకు, ఉపాధ్యాయులకు విద్యాబోధన విషయంలో తగు సూచనలిచ్చారు. ప్రిన్సిపల్ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్‌జెడి డాక్టర్ పి.బాబు

ప్రజలకు లబ్ధి చేకూరేలా పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రజలకు లబ్ధి చేకూరేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాలు అమలు చేస్తు న్నారని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలో కొసినేపల్లి, తిమ్మాపురం గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకు తిరిగి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అధికారుల, సచివాలయ సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రమణారెడ్డి, మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు సుమంత్ యాదవ్, నాయకులు తిరుమలరెడ్డి పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల ఎస్ఐగా ప్రవీణ్‌కుమార్

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల పోలీస్‌స్టేషన్‌కు అదనపు ఎస్ఐగా ప్రవీణ్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కాశీనాయన పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ బదిలీపై వచ్చారు. ప్రవీణ్‌కుమార్ గతంలో కూడా ఇక్కడ విధులు నిర్వర్తించి ఉన్నారు. ఈ సందర్భంగా సిఐ మంజునాథరెడ్డి, ఎస్ఐ కృష్ణయ్య, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం


పెండ్లిమర్రి : అంగన్వాడీ కార్యకర్త, ఆయాల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సూపర్‌వైజర్ ఓబులమ్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేలురుపాడు, పాత సంగటిపల్లి, నందిమండలం గ్రామాల్లో పోస్టులు ఖాళీలున్నాయన్నారు. అభ్యర్థుల వయస్సు 2023 జులై 1న 21 నుంచి 35 ఏళ్ల లోపు ఉండాలన్నారు. కార్యకర్త పోస్టుల కు పదో తరగతి, ఆయా పోస్టులకు ఏడవ తరగతి ఉత్తీర్ణత కావాలన్నారు. ఈనెల 6లోగా దరఖాస్తులను ఐసిడిఎస్ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

కంపుతో విద్యార్థుల అవస్థలు

- సెయింట్ జోసెఫ్ పాఠశాల సమీపంలోనే డ్రెయినేజీ
- వర్షం వస్తే వారి పరిస్థితి వర్ణనాతీతం

ప్రజాశక్తి - కడప

కడప నగరంలోని మరియాపురం సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ముందు భాగంలో ఉన్న డ్రెయినేజీతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షమొస్తే వారి పరిస్థితి వర్ణనాతీతం. మురుగు కాల్వ నుంచి దుర్వాసన వస్తుండడంతో మధ్యాహ్న సమయంలో అన్నం కూడా తినలేక ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో దాదాపు 800 మంది విద్యార్థులు చదువుతున్నారు. స్కూలు పక్కనే ఉన్న డ్రెయినేజీ కాలువకు రక్షణ గోడ లేకపోవడం, చెత్తాచెదారం పేరుకుపోవడంతో మురుగునీరంతా పాఠశాల ఆవరణంలోకి వస్తోంది. దీంతో ఒకటే దుర్గంధం దుర్వాసన. విద్యార్థులు ఈ కంపును తట్టుకోలేకపోతున్నారు. చాలామంది చిన్నారులు అనారోగ్యానికి గురవుతున్నారు. దీంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో చెట్ల కింద కూర్చొని విద్యార్థులు భోజనం చేస్తారు. డ్రెయినేజీ కాలువ కంపు దుర్వాసనతో భోజనం కూడా చేయలేని పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. ఈ విషయం స్కూల్ యాజమాన్యం, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కడప మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా అధికారుల దృష్టికి అనేకమార్లు తీసుకువెళ్లినా పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో విద్యార్థులు తమ గోడు ఎవరు పట్టించుకుంటారని వాపోయారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, కడప మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తక్షణం స్పందించి తమ సమస్యలు పరిష్కరించి, న్యాయం చేయాలని సెయింట్ జోసెఫ్ స్కూల్ విద్యార్థులు వేడుకుంటున్నారు.


కాల్వలో పేరుకుపోయిన చెత్తాచెదారం

ఆర్‌డిఒ కార్యాలయ ఎఒగా సరస్వతి

పులివెందుల రూరల్ : ఆర్‌డిఒ ఎఒగా సరస్వతి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె కడప కలెక్టరేట్‌లో అడ్మినిస్ట్రేషన్ సెక్షన్లో పనిచేస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెడతామని పేర్కొన్నారు.


ఎఒ సరస్వతి